



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 07 | సంచిక : 342 | అమలాపురం | ఎడిటర్ :కె. సునీల్‌కుమార్ | బుధవారం | 14 ఆగస్టు 2024 | పేజీలు : 12 | వెల : 2/-


## ఏపీలో ఆగస్టు 15 నుంచి మూడు పథకాలు ?

*ఏపీలో తాజాగా అధికారం చేపట్టిన కూటమి సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మ్యానిఫెస్టో హామీలను అమలు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తోంది. అయితే వాటిలో అడుగులు మాత్రం వేగంగా ముందుకు పడటం లేదు. ఇప్పటివరకూ సంక్షేమ పథకాల్లో కేవలం పెన్షన్ల పెంపు మాత్రమే అమలైంది. మిగతా పథకాలపై ఇప్పుడు, అప్పుడు అంటూ కాలం గడిపేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎల్లుండి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మూడు పథకాలు ప్రారంభిస్తున్నారంటూ టీడీపీ నేతలు చెప్తున్నారు.*








**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆగస్టు 15న రాష్ట్రంలో మొత్తం మూడు పథకాలను కూటమి ప్రభుత్వం ప్రారంభిస్తోందంటూ ఇప్పటికే టీడీపీ నేతలు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. వీటిలో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతో పాటు తల్లికి వందనం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కూడా ఉన్నాయంటూ వారు ప్రచారం చేస్తున్నారు. వీటిలో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై ప్రభుత్వం ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఆగస్టు 15న ప్రారంభిస్తామంటూ మంత్రులు ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం వేరేలా ఉంది. ఈనెల 17వ తేదీలోపు ఈ రాశులు ధనవంతులవుతారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్ల పునఃప్రారంభానికి ప్రభుత్వం ప్రకటన చేసింది. సీఎం చంద్రబాబు కృష్ణాజిల్లా ఉయ్యూరులో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారని ప్రభుత్వం తెలిపింది. కానీ మిగతా రెండు పథకాలపై మాత్రం ఇప్పటికీ క్లారిటీ లేదు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంపై మంత్రులు, ఎమ్మెల్యేలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. అలాగే తల్లికి వందనం పథకానికి సంబంధించి కూడా ప్రభుత్వం దాటవేత ధోరణిలోనే ఉంది. ఇప్పటికే మండలిలో విద్యా మంత్రి నారా లోకేష్.. వచ్చే ఏడాది నుంచి పథకం అమలు చేస్తామంటూ ప్రకటించారు. దీనికి త్వరలో మిగతా 2లో..

### నాడు దలైలామా..
## నేడు హసీనా



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్** అది 1959.. టిబెట్ పై చైనా పట్టు బిగుస్తున్నది. టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామాకు అప్పటికి 24 ఏళ్లు.. దీంతో ఆయన చైనా బారి నుంచి తప్పించుకునేందుకు తన పరివారంతో 1959 మార్చి 30న భారత్ లోకి వచ్చేశారు. ఏప్రిల్ 18న అస్సాంలోని తేజ్‌పూర్ చేరుకున్నారు. ఇక అప్పటుంచి భారత్ ఆయన నివాసం అయిపోయింది. టిబెట్ వాతావరణానికి దగ్గరగ ఉండే హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో శాశ్వత నివాసం ఏర్పరచుకున్నారు. భారత్ నుంచే ఇతర దేశాల పర్యటనలకు వెళ్తున్నారు. ఆయనను తమకు అప్పగించాలని చైనా మిగతా 2లో..

### మహిళలకు బీహార్ పీకే
## బంపర్ ఆఫర్



**పాట్నా :** రాజకీయాల్లో గెలవాలి అంటే కులంతో పాటు మహిళలు కూడా అతి పెద్ద ఓటు బ్యాంక్‌గా ఉంటారు. వారిని దగ్గరకు తీసుకోవడం ద్వారానే ఎవరైనా సక్సెస్ కాగలరు. ఈ విషయంలో ఎందరికో రాజకీయ వ్యూహకర్తగా పనిచేసిన బీహార్ బాబు పీకే అలియాస్ ప్రశాంత్ కిశోర్ కి తెలియదని ఎలా అనుకుంటారు. పైగా ఆయన బీహార్ లో అధికారంలోకి రావాలని చూస్తున్నారు. జన సురాజ్ అని ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి భారీ ఎత్తున పాదయాత్ర కూడా చేశారు. అలా గ్రౌండ్ లెవెల్ వరకూ పరిస్థితిని ఆయన అధ్యయనం చేశారు. బీహార్ లో ఎన్నడూ అధికారంలోకి రాని కులాలకి ఈసారి మిగతా 2లో..

### కూటమి ప్రభుత్వంపై
## అంబటి ఫైర్




**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఒక విజయం ఏ పార్టీకైనా ఉత్సాహాన్నిస్తుంది. పైగా 151 స్థానాల నుంచి 11 స్థానాలకు పడిపోయిన వైసీపీలో ఇప్పుడు ఒక్క స్థానంలో వేచి ఉన్న విజయం చూసుకుని మురిసిపోతోంది. అదే విశాఖపట్నం స్థానిక సంస్థల కోటాలో వచ్చిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల వ్యవహారం. ఈ ఎన్నికలో మిగతా 2లో..

### కేటీఆర్-హరీష్‌ల మధ్య
## కోల్డ్‌వార్



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :** తమ మీదా.. తమ పార్టీ మీదా అదే పనిగా సోషల్ మీడియాలో దాడులు జరుగుతున్నాయని.. అబద్ధాల్ని.. అసత్యాల్ని అదే పనిగా వండి వారుస్తున్నట్లుగా వారు పేర్కొంటున్నారు. ఈ అంశంలో మాజీ మంత్రి కేటీఆర్ దూకుడుగా వ్యవహరిస్తూ తమ ఇమేజ్ ను డ్యామేజ్ చేసే వారికి మిగతా 2లో..

### ఏపీలో కొత్త
## రాజకీయం షురూ!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ విషయంలో ఒక నిర్ణయానికి ఏపీ ముఖ్యమంత్రి.. టీడీపీ అధినేత చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చేసినట్లుగా తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం బలం లేని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దిగే కంటే.. దూరంగా ఉండాలని.. ఏపీ ప్రజలకు సరికొత్త రాజకీయాన్ని పరిచయం చేయాలని.. ఇప్పటివరకు సాగిన తీరుకు భిన్నంగా ఉండాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. విశాఖ స్థానిక సంస్థల మిగతా 2లో..

**15నుంచి 'పంచ పరివర్తన్' కోసం జనజాగరణ** 4

## ప్రతి అడుగులోనూ బాబు మోసం

### మళ్లీ తగులుకున్న జగన్!




**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** కూటమి అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తయినా ఇప్పటికీ సూపర్ సిక్స్ హామీలపై కూటమి ప్రభుత్వం నుంచి స్పష్టత కరువవుతున్న పరిస్థితి. దీంతో... మైకందుకున్న ప్రతీసారి కూటమి ప్రభుత్వం పై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మిగతా 2లో..

## డిప్యూటీ స్పీకర్ కోసం జనసేన పట్టు ?




**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** టీడీపీ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన కొన్ని కీలకమైన పోస్టుల విషయంలో పట్టుదలగా ఉంది. వాటిని తమకు ఇవ్వాలని కోరుతోంది. ఏపీ అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ పదవి కూడా అందులో ఒకటి అని అంటున్నారు. శాసనసభ స్పీకర్‌గా నర్సీపట్నానికి చెందిన టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు నియమితులయ్యారు. దానికి జనసేన కూడా మనస్ఫూర్తిగా మద్దతు ప్రకటించింది. ఆ సమయంలోనే మిగతా 2లో..

### రోజా ప్లేస్‌లో నగరిలో
## కొత్త నేత ?



**తిరుపతి, విశ్వంవాయిస్ న్యూస్ :** వైసీపీలో ఫైర్ బ్రాండ్ ఆర్కే రోజా ఏమైపోయారు అన్న చర్చ వైసీపీలో సాగుతోంది. ఆమె వైసీపీ ఓటమి తరువాత మీడియా ముందుకు రావడం లేదు. ఇటీవల ఆమె తన కుటుంబంతో విదేశాలలో టూర్ చేస్తున్నట్లుగా ఫోటోలు అయితే వచ్చాయి. ఇక రోజా ఎక్కడ ఉన్నారు అంటే అయితే విదేశాలలో లేకపోతే చెన్నైలో అని ప్రచారం సాగుతోంది. ఆమె మకాం మిగతా 2లో..

## జోగి రమేష్ కుమారుడు అరెస్ట్



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా... ఈ రోజు తెల్లవారుజామున వియవాడ శివార్లలోని ఇబ్రహీంపట్నంలో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేసినట్లు చెబుతున్నారు. అనంతరం కొన్ని గంటలకే జోగి రమేష్ కుమారుడు మిగతా 2లో..

## మహారాష్ట్రలో మళ్లీ పోరు

### ఠాక్రేలలో వీర హిందూత్వ ఎవరు...?



**ముంబై :** దేశంలో మళ్లీ హిందూత్వ నినాదం ఊపందుకుంటోంది. అది కూడా మహారాష్ట్ర నుంచే. మహారాష్ట్రలో ఇప్పటికి ఆరు దశాబ్దాల క్రితమే హిందూత్వ నినాదాలకు ఊపిరులూదిన వారు బాల్ ఠాక్రే. ఆయన అరవై మిగతా 2లో..

### బిగ్ షాట్సే
## నాదెండ్ల టార్గెట్ !



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** రేషన్ బియ్యం అన్నది అక్రమంగా రవాణా అవుతోంది. ఇది అందరికీ తెలిసిందే. రేషన్ దుకాణాల్లో ఉచిత బియ్యాన్ని ఎవరూ తీసుకోవడం లేదు. దానికి అయిన కాడికి అమ్ముకుంటున్నారు. ఆ తరువాత ఆ బియ్యాన్ని డీలర్లు మిల్లర్లకు అమ్ముతారు. అలా అక్కడ నుంచి ఒక రింగ్ గా ఏర్పడి బడా వ్యక్తులే ఇందులో ఇన్వాల్వ్ అవుతున్నారని ఈ బియ్యం అంతా దేశాలు దాటిపోతోందని ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ బియ్యం అక్రమ రవాణా మీద ఫుల్ ఫోకస్ పెట్టింది. ఈ బియ్యం అక్రమ రవాణాలో బిగ్ షాట్స్ ఉన్నారని కూడా కూటమి సర్కార్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక బాంబు పేల్చారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కాకినాడ పోర్టు ద్వారానే జరిగింది అని ఆయన నిర్ధారించారు. దీనికి సంబంధించిన వ్యవహారంలో త్వరలోనే అరెస్టులు ఉంటాయని హింట్ ఇచ్చేశారు. నాదెండ్ల కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలే చెశారు. కాకినాడ పోర్టు వద్ద జరిగిన రెషన్ బియ్యం అక్రమాలపైన లోతైన విచారణ సాగుతోందని అన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకి అడ్డుకట్ట వేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. అక్రమ మిగతా 2లో..

## విశాఖలో ఘోర అగ్నిప్రమాదం



### టీడీపీ వర్సెస్ వైసీపీ మాటల 'ఫైరింగ్'!

**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** విశాఖలోని బీచ్‌లో రోడ్డులో ఉన్న 'డైనో పార్క్'లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. మంగళవారం ఉదయం 12 గంటల తర్వాత జరిగిన ఈ ప్రమాదంలో ఇక్కడ ఏర్పాటు చేసిన రెస్టారెంట్ పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. భారీ ఎత్తున ఎగసిపడిన మంటలు.. సమీపంలోని రోడ్డు మీదకు కూడా వ్యాపించాయి. దీంతో మిగతా 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## నేడు హసీనా

గట్టిగా కోరుతోంది. కానీ, భారత్ తమ అతిథిని పంపేది లేదంటూ తేల్చిచెబుతోంది. చైనాతో యుద్ధం అందుకే.. దలైలామాను అప్పగించనందుకే చైనా 1960ల్లో భారత్ పై యుద్ధానికి దిగింది. అప్పటివరకు హిందీ చీనీ భాయీభాయీ అంటూ ఉన్న వాతావరణం కాస్త ఉద్రిక్తంగా మారింది. చైనాను ఎంతో నమ్మిన భారత తొలి ప్రధాని నెహ్రూ ఆ దేశ నాయకత్వం చేసిన మోసాన్ని తట్టుకోలేక మనో వ్యథకు గురై మరణించారని చెబుతారు. ఇక దలైలామా మాత్రం భారత గడ్డపైన 65 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారు. ఆయన శిష్య పరంపరకూ భారత దేశమే సొంత గడ్డ అయిపోయింది. బౌద్ధ మత గురువు అయిన దలైలామా ఉమ్మడి ఏపీలో జరిగిన బౌద్ధ సమ్మేళనానికీ హాజరయ్యారు. అతిథిని వెళ్లమనలేని భారత బలహీనతకు చాలా మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. భారత్ పై చైనా యుద్ధానికి దిగి అక్సాయ్ చిన్ లోని చాలా ప్రాంతాన్ని ఆక్రమించింది. ఇప్పటికీ అక్కడినుంచి కదలడం లేదు. భారత్‌కు మరో పొరుగు దేశమైన బంగ్లాదేశ్ కు మొన్నటివరకు ప్రధానిగా ఉన్న షేక్ హసీనా ఆ దేశంలో తనపై పెల్లుబికిన నిరసనలతో ఉన్నపళంగా భారత్ కు వచ్చేశారు. అంటే.. హసీనా బంగ్లాలో కాలుపెడితే అరెస్టు చేసి జైలుపాలుజేయడం ఖాయం అనే పరిస్థితులున్నాయి. ఇది రెండోసారి.. హసీనా భారత్ లో ప్రవాసం ఉండడం ఇది రెండోసారి. 1975లో తన తల్లిదండ్రులు, ముగ్గురు సోదరులను సైన్యం హతమార్చిన సమయంలో హసీనా విదేశాల్లో ఉన్నారు. అప్పట్లో బంగ్లాకు వెళ్లలేక ఆరేళ్లు చెల్లెలు రెహానాతో కలిసి భారత్ లో ఉండిపోయారు. బంగ్లాకు తిరిగివెళ్లాక పదేళ్లు పోరాటం చేసి ప్రజాస్వామ్యం నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. 15 ఏళ్లకు పైగా ప్రధానిగా ఉన్నారు. మరి ఇప్పుడు మాత్రం భారత్ నుంచి కదిలే పరిస్థితి లేనట్లుంది.

## బంపర్ ఆఫర్

అవకాశం ఇచ్చి ముందుకు తెస్తామని పీకే ఇప్పటికే చెప్పుకొచ్చారు. తాజాగా ఆయన మరో కీలకమైన ప్రకటన చేశారు. 2025లో బీహార్ లో జరిగే ఎన్నికల్లో పెద్ద ఎత్తున మహిళలకు ఎమ్మెల్యే సీట్లు ఇస్తామని ఆయన తెలిపారు. ప్రతీ లోక్ సభ పరిధిలో ఒక మహిళా అభ్యర్థిని నిలబెట్టడమే రాజకీయ పార్టీగా మారబోతున్న జన సురాజ్ ఆలోచన అని ఆయన చెప్పారు. ఇప్పటిదాకా మహిళా రిజర్వేషన్లు అని చెప్పడం వారి తరఫున ఉద్యమాలు చేయడం తప్ప ఆచరణలో వారికి అవకాశాలు ఇచ్చిన వారు లేరని పీకే అన్నారు. బీహార్ చరిత్రలో ఎపుడూ ఏ పార్టీకి ముప్పయి మంది మహిళా ఎమ్మెల్యేలు లేరని ఆయన చెప్పారు. అయితే తమ పార్టీ మాత్రం లోక్ సభకు ఒక మహిళా అభ్యర్థి వంతున మొత్తం 40 లోక్ సభ సీట్లకు గానూ నలభై మంది మహిళలకు టికెట్లు ఇచ్చి వారిని ఎంపీలు చేయాలని చూస్తున్నామని అన్నారు. ఇదే తమ నినాదమని ఆయన చెప్పారు. అలాగే జన సురాజ్ పార్టీ తరఫున కనీసం ఒక మహిళకు ఎమ్మెల్యే సీటు ఇవ్వాలని గట్టిగా నిర్ణయించామని ఆయన చెప్పారు. అంతే కాదు ఒకరి కంటే ఏదైనా జిల్లాలో ఇద్దరు మహిళా నేతలు ఎమ్మెల్యే పదవికి అర్హులు అని తేలితే ఇద్దరికీ టికెట్లు ఇచ్చి ప్రోత్సహిస్తామని పీకే బంపర్ ఆఫర్ ప్రకటించారు. బీహార్ జనాభాలో సగానికి కంటే ఎక్కువగా ఉన్న మహిళలను తన పార్టీ వైపు తిప్పుకునేందుకు ప్రశాంత్ కిశోర్ ఈ రకమైన రాజకీయ ఎత్తుగడ వేశారు అని అంటున్నారు. అంతే కాదు మొత్తంగా మహిళా ఓట్లను సమీకరించడం ద్వారా జనసేన విజయావకాశాలను భారీగా పెంచుకోవాలన్నది కూడా ఆయన వ్యూహంగా ఉందని అంటున్నారు. మరో వైపు చూస్తే జన సురాజ్ గా ఇంతవరకూ ఉన్న తన సంస్థను ఒక రాజకీయ పార్టీగా మార్చేందుకు గాంధీ జయంతి వేళ అక్టోబర్ 2ను ఆయన ఎంచుకుంటున్నారు అని అంటున్నారు. ఆ రోజు నుంచి ఏడాది పాటు ఎన్నికలకు గడువు ఉంటుదని ఈ సమయం చాలు బీహార్ లో అధికారం దిశగా ముందుకు సాగడానికి అని ఆయన భారీ వ్యూహంతో ఉన్నారని అంటున్నారు. అయితే పీకే ప్రకటనలను ఆయన రాజకీయ పోకడలను బీహార్ లోని అధికార జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్ కుష్వాహ తీవ్రంగా విమర్శించారు.

## అంబటి ఫైర్

వైసీపీకి ఏకపక్షంగా విజయం దక్కుతుందని అనుకున్నా.. స్వతంత్ర అభ్యర్థి రూపంలో ఎన్నికల పోలింగ్ అనివార్యంగా మారింది. ఈ ఎన్నికలో సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ పోటీలో ఉన్నారు. అయితే.. కూటమి ఆది నుంచి పోటీ చేయాలని అనుకున్నా..చివరి నిముషంలో వెనక్కి తగ్గింది. దీంతో బొత్స సత్యనారాయణ విజయం అయితే.. 90 శాతం ఖాయమైంది. ఇక, ఎన్నికల పోలింగ్ సమయానికి స్వతంత్ర అభ్యర్థికి కనుక కూటమి పార్టీలు మద్దతుగా ఉంటే.. అప్పుడు ఖచ్చితంగా ఏం జరుగుతుందనేది చెప్పడం కష్టం. అయితే.. ఇంతలోనే సంబరాల అంబటి రాంబాబు తెరమీదికి వచ్చారు. బొత్స విజయం వైసీపీ పూర్వవైభవానికి బీజం వేసిందంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా కామెంట్ చేశారు. కానీ, ఈ విజయం నిజానికి ఒక విజయం కాదు. ఎందుకంటే.. కూటమి పార్టీలు పోటీలో లేవు. పైగా ఎన్నికల పోలింగ్ కూడా జరుగుతోంది. చివరి వరకు నరాలు తెగే ఉత్కంఠే! దీనికి కారణం స్వతంత్ర అభ్యర్థి వెనుక కీలక కూటమి నాయకులు ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ.. దీనిని తమ విజయం(ఇంకా కన్ఫర్మ్ కాకుండానే) అనే దోరణిలో అంబటి రాంబాబు చెప్పుకొచ్చారు. ఇలాంటివేమీ జరగకుండా.. కూటమి తప్పుకొని వైసీపికి ఒక రకంగా మార్గం సుగమం చేసింది. ఈ పరిణామాలను మరిచిపోయిన అంబటి రాంబాబు సంబరాలు చేసుకోవడం విస్మయం కలిగిస్తోంది. ఏదేమైనా.. ఇది సంబరాలు చేసుకునే విజయమేనా రాంబాబుగారూ! అంటున్నారు పరిశీలకులు. అయితే.. అసలు ఏ చెట్టూ లేని చోట వెంపలి చెట్టే మహావృక్షమైనట్టుగా అంబటి సంబరపడుతున్నారని సరిపుచ్చుకోవాలి.

## కోల్డ్‌వార్

ఎప్పటికప్పుడు వార్నింగ్ లు ఇచ్చేస్తున్నారు. అయితే.. కేటీఆర్ మిస్ అవుతున్న పాయింట్ ఏమంటే.. తమకు చెందిన మీడియా సంస్థలోనూ ఈ తరహా కథనాలు ఎన్నో రాశారు. అంతేకాదు.. గులాబీ పార్టీ డీల్ చేసే సోషల్ మీడియా ఖాతాలు.. యూట్యూబ్ చానళ్లలో వారు వండి వార్చిన కథనాలకు ఆధారాలు.. సాక్ష్యాలు చూపించారా? అని ప్రశ్నిస్తున్నారు. తమ వరకు ఒకలా.. మిగిలిన వారి విషయంలో మరోలా వ్యవహరించే కేటీఆర్ తీరును తప్పు పడుతున్నారు. ఇంతకూ గులాబీ పార్టీలో తాజాగా జరుగుతున్న రాజకీయ పరిణామం.. ఆ పార్టీ నేతల మధ్య హాట్ టాపిక్ గా మారింది. గులాబీ పార్టీలో ఐదు పవర్ సెంటర్లు ఉంటాయన్నది బహిరంగ రహస్యం. అందులో కేసీఆర్.. కేటీఆర్.. కవిత.. హరీశ్ రావులతో పాటు సంతోష్ లు కేంద్రంగా ఉండటం తెలిసిందే. మిగిలిన పవర్ సెంటర్ల సంగతి ఎలా ఉన్నా.. కేటీఆర్ – హరీశ్ మధ్యన అధిపత్య పోరు నడుస్తూనే ఉందన్న వాదన తరచూ వినిపిస్తోంది. సదరు సంస్థకు సంబంధించిన ఒక వివాదంలో రాజకీయంగా ముందుకు వెళ్లకూడదన్న స్టాండ్ హరీశ్ తీసుకుంటే.. కేటీఆర్ మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఇష్యూపై రాజకీయంగా ముందుకు వెళ్లకూడదన్నది హరీశ్ ఆలోచన అయితే.. అలాంటిదేమీ వద్దన్నట్లుగా కేటీఆర్ తీరు ఉందంటున్నారు. దీంతో.. ఈ ఇద్దరు భిన్నరీతిలో రియాక్టు కావటంతో గులాబీ నేతలు పలువురు ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు సమాచారం. ఈ మొత్తం ఎపిసోడ్ లో గులాబీ పార్టీ మీడియా కూడా కేటీఆర్ పక్షాన నిలిచినట్లుగా తెలుస్తోంది. దీనిపై హరీశ్ అసంత్రప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈ ఎపిసోడ్ ఎక్కడి వరకు వెళుతుందన్నది పింకీల మధ్య చర్చగా మారింది.

## మూడు పథకాలు ?

మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. కానీ ఇప్పటివరకూ మార్గదర్శకాలు రాలేదు. అలాగే ఎన్నికల హామీ మేరకు ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ దీన్ని వర్తింపచేస్తామని చెప్తున్నారు. కానీ దీనిపైనా అధికారిక ఉత్తర్వులు రాలేదు. అసలు ఈ ఏడాదికి ఇవ్వాల్సిన అమ్మఒడి పథకాన్ని పేరు మార్చి తల్లికి వందనం పేరుతో అమలు చేయాల్సి ఉండగా.. నిధుల కొరతతో దీన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. కానీ ఇవేమీ తెలియని టీడీపీ, జనసేన నేతలు మాత్రం సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూనే ఉన్నారు.

**అమరావతికి అండగా ప్రపంచ బ్యాంకు**

చంద్రబాబు తో మాట్లాడిన అనంతరం ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం అమరావతికి అండగా ఉండేందుకు సానుకూలంగా ఉందని సీఆర్డీయే అధికారులు చెప్పారు. మరోమారు ప్రపంచ బ్యాంకు ఉన్నతాధికారుల బృందం మళ్ళీ మన రాష్ట్రానికి వస్తుందని, ఆ తర్వాతే రాబోయే రుణంపై స్పష్టత వస్తుందని అన్నారు.

## రాజకీయం షురూ!

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ నామినేషన్ వేయటం తెలిసిందే. ఈ ఎన్నికల్లో మొత్తం 838 ఓట్లు ఉంటే.. అత్యధికంగా (500లకు పైగా ఓట్లు) వైసీపీకే ఉన్నాయి. అలాంటి వేళలో ఏపీ అధికారపక్షంగా ఉన్న కూటమిలోని ప్రధాన భాగస్వామి అయిన టీడీపీ బరిలోకి దిగుతుందన్న అభిప్రాయం జోరుగా సాగుతోంది. అయితే.. ఈ అంశంపై చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. విలువల గురించి అదే పనిగా మాట్లాడుతున్న వేళలో.. ఏపీ ప్రజలకు సరికొత్త రాజకీయాన్ని చూపిస్తామని చెప్పి.. బలం లేని చోట బరిలోకి దిగటం మంచి సంకేతాలు ఇవ్వదన్న భావనకు చంద్రబాబు వచ్చినట్లుగా తెలుస్తోంది. అదే సమయంలో కూటమి భాగస్వామి అయిన పవన్ కల్యాణ్ సైతం అలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లుగా సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రక గెలుపును అందించిన ప్రజలకు.. ఒక్క సీటు కోసం కక్కుర్తి పడినట్లుగా కనిపించటంలో అర్థం లేదన్నట్లు తెలిసింది. దీనికి తోడు ఒక్క ఎమ్మెల్సీని అదనంగా పొందటం వల్ల వచ్చే లాభం కంటే కూడా.. ఒక్క ఎమ్మెల్సీ కోసం అడ్డదారులు తొక్కిన అపప్రథను మూటకట్టుకోవటం ఏ మాత్రం సరికాదన్న విషయాన్ని స్పష్టం చేసినట్లుగా సమాచారం. ఇదే విషయాన్ని తెలుగు తమ్ముళ్లకు చెప్పగా.. కొందరు పోటీ చేసి.. అధికార బలాన్ని చూపించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా వారి మాటల్నిసీఎం చంద్రబాబు సున్నితంగా తిరస్కరించినట్లు చెబుతున్నారు. ఐదేళ్ల వైసీపీ సర్కారు గురించి తరచూ మాట్లాడటం.. అందుకు భిన్నంగా వ్యవహరించే కన్నా.. పోటీకి దూరంగా ఉండటం ద్వారా బలం లేని చోట బలాన్ని ప్రదర్శించాలన్న తీరు తమకు లేదన్న విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చేయాలన్నది చంద్రబాబు ఆలోచన. తన నిర్ణయంతో వైసీపీకి.. తనకు మధ్యనున్న తేడాను తెలిపేందుకు వీలుగా బరిలో ఉండకూడదని డిసైడ్ చేసినట్లుగా తెలుస్తోంది.

## ప్రతి అడుగులోనూ బాబు మోసం

జగన్ విరుచుకుపడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి ప్రతి అడుగులోనూ చంద్రబాబు మోసం కనిపిస్తోందని జగన్ ఫైరయ్యారు. అవును... మాడుగుల నియోజకవర్గ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలతో తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో వైసీపీ అధినేత జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. ఇందులో భాగంగా... చంద్రబాబు ప్రజలకు ఆశ చూపారని, చివరకు ప్రజల్ని మోసం చేస్తున్నాడని అంటూ జగన్ మండిపడ్డారు. నాడు ఎంతో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ హామీలు నెరవేర్చడంలో వైసీపీ ప్రభుత్వం సాకులు చూపలేదని అన్నారు. ఈ సందర్భంగా.. వైసీపీ ప్రభుత్వం మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్ లా భావించిందని.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ మాటకు కట్టుబడి పనిచేసిందని.. ప్రతీ ఇంటికీ మంచి చేసిందని చెప్పిన జగన్.. ఆ మంచి ఎక్కడికీ పోదని, వచ్చే ఎన్నికలు వచ్చేసరికి ఆ మంచే వైసీపీకి శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలు ప్రజల ఆగ్రహానికి దారితీస్తాయని నొక్కి చెప్పారు. జగనే ఉండి ఉంటే... రైతు భరోసా అందేదని.. స్కూళ్లకు వెళ్తున్న ప్రతి పిల్లడి తల్లులకు అమ్మ ఒడి అందేదని.. సున్నా వడ్డీ కూడా వచ్చి ఉండేదని.. విద్యాదీవెన కింద ఫీజు రీయింబర్స్ మెంట్, వసతి దీవెన వచ్చేదని జగన్ తెలిపారు. ఇక మత్స్యకార భరోసా, వాహమ మిత్ర, చేనేతలకు నేతన్న నేస్తం ఈసరికే పడి ఉండేవని జగన్ తెలిపారు. ఆగస్టు నెలాఖరులోపల ప్రతీ ఏటా ఇవి వైసీపీ ప్రభుత్వం ఇచ్చేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందేవని చెప్పిన జగన్... ఇప్పుడు మాత్రం జన్మభూమి కమిటీల చుట్టూ, టీడీపీ నేతల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి అని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రతి అడుగులోనూ మోసం కనిపిస్తోందని జగన్ విమర్శించారు. ఇక స్కూళ్లలో టోఫెల్ పీరియడ్ తీసేశారని.. ప్రపంచంతో పోటీ పడే చదువులను నిర్వీర్యం చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు. ఇదే క్రమంలో... విద్యాకానుక పంపిణీ, మధ్యాహ్న భోజనంలో ప్రతీ రోజూ ఉండే మెనూ కూడా అస్తవ్యస్తం అయ్యిందని.. ఇంగ్లిష్ మీడియం చదువులు అటకెక్కే పరిస్థితి వచ్చిందని ఇదే క్రమంలో... ఆరోగ్య శ్రీ కింద ఒక్కపైసా ఇవ్వడం లేదని.. కేవలం రెడ్ బుక్ పాలన మాత్రమే ఇప్పుడు ఏపీలో నడుస్తోందని.. కక్షలు తీర్చుకునేవారిని ప్రోత్సహించేలా బాబు తీరు ఉందని జగన్ ఫైరయ్యారు. ఈ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

## డిప్యూటీ స్పీకర్ కోసం జనసేన పట్టు ?

డిప్యూటీ స్పీకర్ పదవిని జనసేనకు ఇస్తారని ప్రచారం సాగింది. అయితే ఆ తరువాత బడ్జెట్ సెషన్ పేరుతో మరో అయిదు రోజుల పాటు సభ జరిగినా కూడా డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రస్తావన లేకుండానే ముగిసింది. అయితే ఈసారి శీతాకాల సమావేశాలలోగా డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ఉంటుందని అంటున్నారు. ఈ కీలక పదవి తమకే దక్కాలని జనసేన కోరుతోంది అన్నది పెద్ద ఎత్తున సాగుతున్న ప్రచారం. టీడీపీలో ఉంటూ సరిగ్గా ఎన్నికల ముందు జనసేనలోకి వెళ్ళి టికెట్ సంపాదించి అవనిగడ్డ నుంచి గెలిచిన సీనియర్ నేత మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ కి ఈ పదవిని ఇప్పించాలని జనసేన అధినాయకత్వం భావిస్తోంది అని చెబుతున్నారు. ఇప్పటికి నాలుగు సార్లు బుద్ధ ప్రసాద్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన మంత్రిగా చేసింది మాత్రం వైఎస్సార్ మంత్రివర్గంలోనే. ఆ తరువాత అమాత్య యోగం అయితే పట్టలేదు. విభజన తరువాత ఆయన టీడీపీలో చేరారు. ఆయన మళ్లీ ఎమ్మెల్యేగా అవనిగడ్డ నుంచి గెలిచినా మంత్రి పదవి మాత్రం అందని పండు అయింది. ఆయనను డిప్యూటీ స్పీకర్ గానే చంద్రబాబు నియమించారు. ఇక 2019లో ఆయన ఎన్నికల్లో ఓటమి పాలు అయ్యారు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల మీద ఆశ పెట్టుకుంటే అవనిగడ్డ సీటు జనసేనకు ఖరారు చేశారు. దాంతో ఆ పార్టీలోకి వెళ్ళి గెలిచి వచ్చినా మండలికి మంత్రి పదవి దక్కలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో మండలికి కేబినేట్ ర్యాంక్ కలిగిన డిప్యూటీ స్పీకర్ పదవి ఇప్పించడానికి జనసేన అధినాయకత్వం ప్రయత్నాలు చేస్తోంది అని అంటున్నారు. అయితే టీడీపీ నుంచి కూడా ఈ పదవికి గట్టి పోటీ ఉంది అని అంటున్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన కాల్వ శ్రీనివాసులు పేరు ప్రస్తావనకు వస్తోంది. అలాగే దక్షిణ కోస్తా జిల్లాలకు చెందిన నేతలు కూడా ఈ పదవి కోసం చూస్తున్నారు. గోదావరి నుంచి కూడా ఈ పదవిని ఆశించే వారు ఉన్నారు. టీడీపీ డిప్యూటీ స్పీకర్ పదవిని తమకే ఉంచుకోవాలని చూస్తోంది అని అంటున్నారు. కానీ మిత్ర పక్షం అయిన జనసేన పట్టుబట్టడంతో ఈ పదవి ఏ పార్టీని వరిస్తుంది అన్నది ఉత్కంఠను రేపుతోంది. జనసేనకు ఈ పదవి కేటాయిస్తే మండలికే చాన్స్ అని అంటున్నారు. మండలి ఈ పదవితో అయినా సంతృప్తి పడాల్సి ఉంటుంది. మరి మండలి లక్ ఎలా ఉందో అన్నది కూడా చూడాల్సి ఉంది.

## కొత్త నేత ?

చెన్నైకి మార్చేశారు అని అంటున్నారు. ఆమె ఓటమి తరువాత నగరి రావడం మానుకున్నారు అని అంటున్నారు. నిజానికి రోజా ఎమ్మెల్యేగా ఉన్నపుడు నగరికి నెలలో ఒకసారి అయినా వచ్చేవారు. ఆమె నగరిలో అద్భుతమైన ఇల్లు నిర్మించుకున్నారు. తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను అని కూడా చెప్పారు. అయితే వైసీపీ ఓటమి తరువాత మాత్రం రోజా నగరికి దూరం అయ్యారా అన్న చర్చ అయితే సాగుతోంది. ఆమె ఒక విధంగా వైరాగ్యంలో ఉన్నారని అంటున్నారు. ఆమె ఓటమి వెనక సొంత పార్టీ వారు కూడా ఉండడమే ఆమెను కలచివేసింది అని అంటున్నారు. నగరిలో వర్గ పోరుని మంత్రిగా ఉన్నపుడు అయినా ఆమె సెట్ చేసుకోలేకపోయారు అని అంటున్నారు. పార్టీ అధినాయకత్వం కూడా ఈ విషయంలో పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడంతో ఆమెకు భారీ నష్టం వాటిల్లింది. మరో వైపు రోజా నగరిలో తనకు ఎదురులేదని కూడా భావించారు అని అంటున్నారు. నగరిలో సీనియర్ టీడీపీ నేత ముద్దు కృష్ణమనాయుడు మరణం తరువాత వారసత్వం కోసం ఆ కుటుంబంలో సాగిన పోరుతో టీడీపీ ఇబ్బంది పడింది. దాంతో 2014, 2019లలో రోజా విజయం సాధించారు. ఇక అలాగే ఎప్పటికీ పరిస్థితి ఉంటుందని ఊహించారు అని అంటున్నారు. అదే ఆమె చేసిన పొరపాటు అని కూడా అంటున్నారు. వైసీపీ అధినాయకత్వం వద్ద ఉన్న సాన్నిహిత్యంతో ఆమె టికెట్ అయితే తెచ్చుకోగలిగారు కానీ ఆమె నగరి ప్రజల మనసును గెలుచుకోలేకపోయారు. నిజానికి నగరి నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. కానీ ఆర్కే రోజాకు అది కలిసి వచ్చింది. అక్కడ తమిళ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఆమె భర్త సెల్వమణి తమిళుడు కావడం వల్ల ఆయన కులస్తులు అంతా ఎక్కువగా ఉండడం ఆమెకు ప్లస్ అయింది. అయితే ఈసారి ఎన్నికల్లో మాత్రం అది రివర్స్ అయింది. తాను తప్ప ఎవరు గెలుస్తారు అని దూకుడుగా వెళ్ళిన రోజాకు చేదు ఫలితం ఎదురైంది. సొంత పార్టీలో వారిని కలుపుకోవడంలో విఫలం కావడమే ఎక్కువ డ్యామేజ్ చేసింది అని అంటున్నారు. మరో వైపు జగన్ అయితే రోజాకు ఎంతో ప్రయారిటీ ఇచ్చారు. పార్టీలో ఎంతో మంది సీనియర్లు చిత్తూరు జిల్లాలో ఉన్నా కూడా రోజాకు మంత్రి పదవి కట్టబెట్టారు. వైఎస్ జగన్ వెంట నడిచి వైఎస్సార్ కుటుంబానికి అత్యంత విధేయుడుగా ఉన్న భూమన కరుణాకరరెడ్డిని సైతం పక్కన పెట్టేశారు జగన్. అలా అధినాయకత్వం ఎంతగానో ప్రోత్సహించినా రోజా మాత్రం తన రాజకీయ భవిష్యత్తుకు పటిష్టమైన బాటలు వేసుకోలేకపోయారు అని అంటున్నారు. ఆమె మంత్రిగా కూడా తన కత్తికి ఎదురులేకుండా ఉండాలని తపన పడేవారు అంటారు. ఇక నగరి లో ఆమె సోదరుడి ఆధిపత్యం కూడా ఆమెకి పార్టీకి మధ్య గ్యాప్ పెంచిందని అంటారు. ఏది ఏమైనా ఓటమి ఘోరమైనది దానిని తట్టుకుని తగిన పాఠాలను నేర్చుకుంటూ ముందుకు సాగాలి. కానీ రోజా మాత్రం నగరి వైపు చూడటం లేదు అని అంటున్నారు. నగరిలోని ఆమె ఇంటికి వెళ్తున్న వైసీపీ క్యాడర్ అక్కడ తాళం వేసి ఉండడాన్ని గమనిస్తున్నారు అని అంటున్నారు.

## జోగి రమేష్ కుమారుడు అరెస్ట్

రాజీవ్ ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అవును... మంగళవారం తెల్లవారుజామున సుమారు 15 మంది అధికారు జోగి రమేష్ నివాసంలో సోధాలు చేపట్టారు. ఈ క్రమంలో పలు కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారు. అయితే ఈ సోదాలు అయిన కొన్ని గంటలకే జోగి రమేష్ కుమారుడు రాజీవ్ ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. సీఐడీ స్వాధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను మరికొంతమందితో కలిసి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా స్పందించిన జోగి రాజీవ్... తన తండ్రిపై ఉన్న కక్షతోనే తనను అరెస్ట్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని అన్నారు. ఇదే సమయంలో... కేసును చట్టపరంగానే ఎదుర్కొంటామని వెల్లడించారు. మరోపక్క తన కుమారుడు రాజీవ్ అరెస్ట్ పై మాజీ మంత్రి జోగి రమేష్ స్పందించారు. ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబుని ప్రశ్నించారు. ఇందులో భాగంగా... అగ్రిగోల్డ్ వ్యవహారంలో తాను ఎలాంటి తప్పూ చేయలేదని చెప్పిన జోగి రమేష్.. తాను కానీ, తన కుటుంబం కానీ అగ్రిగోల్డ్ ఆస్తుల విషయంలో ఏదైనా తప్పు చేసి ఉంటే విజయవాడ నడిరోడ్డులో ఉరేసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా... బలహీన వర్గాలకు చెందిన తమను వేధించడం న్యాయమా చంద్రబాబు నాయూ అంటూ ప్రశ్నించారు. తన కుటుంబంపై కక్షసాధింపు చర్యలకు పాల్పడితే పైన దేవుడున్నాడని అన్నారు.

## మహారాష్ట్రలో మళ్ళీ పోరు

దశకంలో శివసేన పార్టీని స్థాపించి నాటి అధికార కాంగ్రెస్ మీద పోరాటం చేశారు. అది కాస్తా ఒక బలమైన శక్తిగా మారి 90 దశకం నాటికి అధికారంలోకి వచ్చింది. బాల్ థాక్రే పార్టీకి వెన్ను దన్నుగా ఉన్నది ఆయన సోదరుని కుమారుడు రాజ్ ఠాక్రే. ఆయన శివసేన విద్యార్థి విభాగాన్ని స్థాపించారు. అలా బాల్ థాక్రేకు వారసుడిగా తొంబై దశకంలో రాజకీయాల్లోకి దూసుకుని వచ్చారు. అచ్చం బాల్ ఠాక్రే ని పోలిన తీరున దూకుడుతో కూడిన ప్రసంగాలు చేయడంతో రాజ్ ఠాక్రే దిట్ట. ఆయన కూడా పెదనాన్న బాటలో వీర హిందూత్వ నినాదాన్ని వ్యాప్తి చేశారు. ఇక చూస్తే 1995లో మహారాష్ట్రలో శివసేన బీజేపీ సంకీర్ణం తొలిసారిగా అధికారంలోకి రావడానికి రాజ్ ఠాక్రే ఎంతో కృషి చేశారు. అలా దశాబ్దన్నర కాలం పాటు ఆయన పెదనాన్న బాల్ థాక్రేతో ఉన్నారు. అయితే బాల్ ఠాక్రే సొంత కుమారుడు ఉద్ధవ్ థాక్రేని రాజకీయాల్లోకి తీసుకుని రావడంతో సోదరులు ఇద్దరి మధ్యన విభేదాలు మొదలయ్యాయి. దాంతో శివసేనను వీడి రాజ్ ఠాక్రే సొంతంగా మహా రాష్ట్ర నవ నిర్మాణ సేనను స్థాపించారు. ఆయన పార్టీ ఎన్నికల్లో పోటీ చేసినా ఆశించిన ఫలితాలు అయితే దక్కలేదు. దానికి కారణం బీజేపీ శివసేన బంధం గట్టిగా ఉండడం. 2019 తరువాత ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన కాంగ్రెస్ తో ఎన్సీపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అలా ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి అయ్యారు. దాంతో శివసేన మూల సిద్ధాంతాలకు ఉద్ధవ్ భంగం కలిగించారని రాజ్ ఠాక్రే ఆరోపిస్తూ వచ్చారు. సరిగ్గా ఈ సమయంలోనే శివసేన నిలువునా చీలింది. అందులో నుంచి ఏక్ నాథ్ షిండే బయటకు వచ్చి బీజేపీతో చేతులు కలిపి సీఎం అయ్యారు. ఇపుడు వీర హిందూత్వ ఎవరు అన్నది ఠాక్రే సోదరుల మధ్యన రాజకీయ పోరుగా సాగుతోంది. బాల థాక్రేకు అసలు వారసుడు ఎవరు అన్నది మహారాష్ట్ర ఎన్నికల్లో తేల్చుకోవాలని రాజ్ ఠాక్రే మరో వైపు ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారు. దూకుడుగా రాజకీయాలు చేయడంతో పాటు ప్రజలను ఆకట్టుకునే ప్రసంగాలు చేయడంతో రాజ్ ఠాక్రే దిట్ట. ఆయన అచ్చం బాల్ ఠాక్రే మాదిరిగానే జనాలను ప్రభావితం చేయగలరు. ఇపుడు ఆయన మళ్ళీ రాజకీయాల్లో తన మార్క్ చూపించాలని చూస్తున్నారు. కాంగ్రెస్ తో కలసిన ఉద్ధవ్ ఠాక్రే బాల్ థాక్రేకి వారసుడు కారని చెప్పడమే రాజ్ ఉద్దేశ్యం. మరో వైపు చూస్తే ఇటీవల బీజేపీ ప్రతిపాదించిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు అనుకూలంగా శివసేన వ్యవహరించాల్సి వచ్చింది. దానికి కారణం మహారాష్ట్రలో చోటు చేసుకున్న పరిణామాలే అని అంటున్నారు. శివసేనకు ఉన్న హిందూత్వ ఓటు బ్యాంక్ ని ఒడిసి పట్టుకోవడానికి రాజ్ ఠాక్రే చూస్తున్నారు. దాంతో ఉద్ధవ్ ఠాక్రే బీజేపీకి మద్దతు ఇవ్వాల్సి వచ్చింది. దీంతో కాంగ్రెస్ ఎన్సీపీలతో ఉద్ధవ్ ఠాక్రే శివసేనకు మధ్య విభేదాలు ఏర్పడుతున్నాయి. రానున్న రోజులలో వీర హిందూత్వను రాజ్ మరింతగా ముందుకు తెస్తారు. అది ఉద్ధవ్ కి ఇబ్బందికరమే అని అంటున్నారు. ఇక ఏక్ నాథ్ షిండేతో వంటి మాస్ లీడర్ సీఎం గా ఉంటూ శివసేనను చీల్చాల్సింది చీల్చారు. దాంతో ఉద్ధవ్ ఠాక్రే రాజకీయ చాణక్యం మీద ఆయన నాయకత్వ పటిమ మీద ఇపుడు అందరి చూపు ఉంది.

## విశాఖలో ఘోర అగ్నిప్రమాదం

ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది.. హుటాహుటి న రంగంలోకి దిగి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. నిత్యం అత్యంత రద్దీగా ఉంటే డైనో పార్కు గురించి... ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రామకృష్ణ బీచ్‌లో చిన్నారుల కోసం.. దీనిని ఏర్పాటు చేశారు. బీచ్‌కు వచ్చే సందర్శకులకు ఇది ఆనందాన్ని, ఆహారాన్ని కూడా అందిస్తోంది. ప్రకృతి రమణీయతకు అద్దంపట్టేలా దీనిలో ఏర్పాట్లు ఉన్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు కూడా ఇక్కడ కూర్చుని.. సముద్ర కెరటాల సవ్వడులను ఆస్వాదిస్తూ ఉంటారు. అలాంటి పార్క్ మంటల్లో చిక్కుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ ప్రమాదంపై రెండు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. 1) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ 2) ఉద్దేశ పూర్వకంగా కొందరు అలజడి సృష్టించేందుకు, నగరం బ్రాండ్‌ను దెబ్బతీసేందుకు చేసిన చర్యగా పేర్కొంటున్నారు. వాస్తవానికి షార్ట్ సర్క్యూట్ అయితే.. సిబ్బంది ఏం చేస్తున్నారన్నది ప్రశ్న. అలా కాకుండా.. సంఘ విద్రోహ శక్తుల పనే అయితే.. నిత్యం అత్యంత బిజీగా ఉండే ఈ రోడ్డులోనే ఇలా చేశారంటే దీని వెనుక ఎవరున్నా రనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి విశాఖ బ్రాండ్పై దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శలు గుప్పిస్తు న్నారు. వైసీపీ హయాంలో ఏర్పాటైనందుకే దీనిని తగుల బెట్టారని దీనివెనుక అధికార పార్ట కార్యకర్తలు ఉన్నారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. మొత్తానికి జరగాల్సిన నష్టం అయితే జరిగిపోయింది. ఇక, ఇప్పుడు రాజకీయ విమర్శలే మిగిలాయి.

## నాదెండ్ల టార్గెట్ !

రవాణాను అడ్డుకునేందుకే కాకినాడ పోర్టులో చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లుగా కూడా వెల్లడించారు. కాకినాడ యాంకరేజీ పోర్టును దుర్వినియోగం చేశారని ఆయన అన్నారు. అంతే కాదు కేవలం ఒక కుటుంబం కోసం కాకినాడ పోర్టు లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా మంట పుట్టిస్తున్నాయి. కాకినాడ పోర్టు కేంద్రంగా జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని నాదెండ్ల అన్నారు. ఏపీలో గత ఐదేళ్లుగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగిందని దానికి ఏకంగా కాకినాడ పోర్టు అడ్డాగా మారిందని నాదెండ్ల ఆరోపణలు చేశారు. ఆహార భద్రత చట్టం కింద రాష్ట్రవ్యాప్తంగా కోటీ 47 లక్షల రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా బియ్యం సరఫరా చేస్తుంటే ఆ బియ్యాన్ని 10 రూపాయిల లోపు ధరకు వినియోగదారుల నుంచి కొనుగోలు చేసి బ్రోకెన్ రైస్, బాయిల్ రైస్ పేరిట ఇతర దేశాలకు ఎగుమతి చేసి పెద్ద ఎత్తున అమ్ముకుంటున్నారని నాదెండ్ల అసలు గుట్టు బయట పెట్టారు. కాకినాడ పోర్టులో జూన్ 28, 29 తేదీల్లో నిర్వహించిన తనిఖీల్లో 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్ చేస్తే అందులో 26 వేల మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యంగా అధికారులు నిర్ధారించారని మంత్రి చెప్పారు. ఈ మొత్తం ఈ వ్యవహారంపై శాఖాపరమైన విచారణ పూర్తికావచ్చిందని బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని భారీ అరెస్టులు ఉంటాయని స్పష్టం చెశారు. అలాగే అక్రమాలకు కారకులైన వారికి 41ఏ నోటీసులు జారీ చేస్తామనివిచారణ పూర్తయ్యాక అరెస్టులు తప్పకండా ఉంటాయని అన్నారు. నాదెండ్ల మాటలను బట్టి చూస్తూంటే తొందరలో పెద్ద ఎత్తున అరెస్టులు ఖాయమని తేలుతోంది. మరి ఆ బిగ్ షాట్స్ ఎవరు అన్నది తేలాల్సి ఉంది. ఇతర దేశాలకు ఇంత పెద్ద ఎత్తున బియ్యం రవాణా అక్రమంగా చేయడం అంటే మాటలు కాదు, దానికి ఎంతో పలుకుబడి కలిగి ఉండాలి. గత అయిదేళ్ళుగ విచ్చలవిడిగా కాకినాడ పోర్టు అక్రమ బియ్యం రవాణాతో మోత మోగిందని కూటమి పెద్దలు చెబుతున్న దానిని బట్టి చూస్తే అరెస్టులు సంచలం రేకెత్తించలాగానే ఉంటాయని అంటున్నారు.

## ఎడిటర్ వాయిస్

### 'వైఫ్ ఆఫ్' కాదు..!

'పెళ్లికి ముందు ఎంతో చలాకీగా, ఉత్సాహంగా, చదువు, తెలివితేటలు ఉన్న అమ్మాయి పెళ్ళవగానే ఇంటి బాధ్యతతో తానేమిటో, తన పేరేమిటో కూడా మర్చిపోతుంది. పిల్లలు 'అమ్మ' అని, పనిమనిషి 'ఆఫీసురు గారి భార్య' అని, భర్త 'ఏమేవ్' అని, తల్లిదండ్రులు 'అమ్మాయ్' అని చెప్తారు. తన పేరు తెలుసు కోవాలనే ప్రయత్నంలో చిన్ననాటి స్నేహితురాలు ఎదురై తన పేరుతో పిలుస్తుంది. అప్పటివరకూ అసలు తన అస్తిత్వాన్ని కూడా మర్చిపోతుంది. తర్వాత పాత పైళ్ళు తీసి తన సర్టిఫికెట్స్, బహుమతులు, బొమ్మలు అన్నీ పిల్లలకి, భర్తకి గర్వంగా చూపుతుంది'. ఆడపిల్లకి పెళ్ళవగానే కుటుంబం, భర్త, పిల్లలు తప్ప తన గురించిన ధ్యాసే ఉండకూడదు. వుంటే గింటే 'వైఫ్ ఆఫ్' గానే ఉండిపోవాలన్న ఆధిపత్య భావజాలానికి అనుగుణంగా స్త్రీని ఇంటికే పరిమితం చేసిన తీరుని వ్యంగ్యంగా చెప్తారు 'ఇల్లలకగానే పండగౌనా' కథలో ప్రముఖ రచయిత్రి పి.సత్యవతి. తన గురించి తాను తెలుసుకునే క్రమంలో ఎంతో చైతన్యశీలిగా మారింది స్త్రీ. తరతరాలుగా వంట యింటికే అతుక్కుపోయి, వండి వారుస్తూ పిల్లల్నికనే యంత్రంగా గడిపిన యాంత్రిక జీవనం గతకాలపు స్త్రీది. కానీ, నేటి స్త్రీ మారుతున్న కాలానికనుగుణంగా తనూ మారుతూ.. స్పందిస్తూ॰% తన గొంతు సవరించుకుంది. తన స్థానం వంటిల్లేకాదు అంతరిక్షం వరకూ తనకసాధ్యమైనది లేదని నిరూపించుకుంటోంది. తరతరాలుగా సాగించిన అణచివేత నుంచి ఒక ధిక్కారస్వరాన్ని వినిపించింది. ఎంత చదువుకున్నా, ఎంత ఉన్నతమైన పదవిలో వున్నా పలానావారి కూతురనో, భార్య అనో చెప్తారే తప్ప, తనకంటూ ఒక అస్తిత్వం, గుర్తింపు వున్నాయనే విషయాన్ని తొక్కిపెట్టేస్తారు. అందుకే అంటాడు చలం 'స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది దానికి అనుభవం కావాలి' అని. అధిపత్య భావజాలం అడుగడుగునా వ్యక్తమౌతున్న బిజెపి ప్రభుత్వంలో రాజ్యసభ సాక్షిగా జయాబచ్చన్ ధిక్కారస్వరాన్ని వినిపించారు. పేరులో ఏముంది? అంటారుగానీ ఒక్కోసారి ఆ పేరు పిలిచేతీరు, పలికే తీరులోని వ్యంగ్యం, ఆ స్వరంలోని తీవ్రతను బట్టి॰% ఇచ్చే గౌరవాన్ని అంచనా వేయొచ్చు. మరీ ముఖ్యంగా కళారంగంలో వున్న జయాబచ్చన్ వంటి వారు, ఎదుటివారి పిలుపులోని గౌరవాన్ని, వ్యంగ్యాన్ని సులభంగానే అర్థం చేసుకోగలరు. రాజ్యసభలో చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ 'జయా అమితాబ్ బచ్చన్' అని వ్యంగ్యంగా, తీవ్ర స్వరంతో పిలవడమేగాక తన భర్త పేరుతోగాక, తన పేరుతో సంభోదించాలని కోరినా వితండవాదం చేయడంతో పలువురు మహిళా ఎంపీలు తమ గొంతును వినిపించారు. తమ అస్తిత్వాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. నిరసనగా ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. అయినా, మనువాద భావజాలాన్ని అణువణువునా జీర్ణించుకున్న ధన్‌ఖడ్ అధికార ఆధిపత్యంతో బెదిరింపు ధోరణి ప్రదర్శించారు. భారతీయ సంస్కృతి గురించి వాగాడంబం ప్రదర్శించేవారు వారు అమలుపరిచే మనుస్మృతి చెప్పిన 'యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతా' అన్న సూక్తిని కూడా తమకు అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. స్త్రీలకు కనీస హక్కులు లేవు, అనుకున్నది చేసే స్వేచ్ఛలేదు. నచ్చిన బట్టలు కట్టుకునే హక్కులేదు. ఆర్థిక స్వాతంత్ర్యం, అధికారం అసలే లేదు. కానీ, నేటి ఆధునిక స్త్రీ ఈ అవాంతరాలన్నీ దాటు కుంటూ వస్తోంది. సాధికా రత దిశగా పయనిస్తోంది. 'ఆధునిక స్త్రీ చరిత్రను పునర్లిఖిస్తుంది' అంటారు మహాకవి గురజాడ. కేవలం 'వైఫ్ ఆఫ్' కాదు మై సెల్ఫ్ అంటూ ఆత్మ విశ్వాసం ప్రకటిస్తోంది. దాని ప్రతిరూపమే పార్లమెంటులో ప్రతిధ్వనిస్తోన్న మహిళా గళం. తన కలలకొక రూపు ఏర్పడి, అవి ఫలిస్తున్న దశలో వేరుపురుగుల్లా కొన్ని ఆధిపత్య శక్తులు ఆటంకపరుస్తున్నాయి. 'సంకె ళ్లను ఇంకెన్నాళ్లు మోస్తావ్/ నిన్ను నువ్వే పక్షి రెక్కలా నిమురుకుని ఎగరేసుకోవాలి/ కుంగినప్పుడల్లా ఆకాశాన్ని నిగడతన్ను' అంటారో కవయిత్రి. స్త్రీలలో ఎంతోకాలంగా అణగారివున్న ఆలోచనలు, ఆవేదనలు వారిలో చేతనా జ్వాలలు రగిలించగల దివిటీలు. ఇవి వారిలోని అజ్ఞాత విజ్ఞాన శక్తులను ప్రబుద్ధం చేస్తుంది. తమ గళాలకు మరింత పదును పెడుతుంది.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# ప్రజా వెల్లువ.. పరిణామాలు

***బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజా వెల్లువ, ప్రభుత్వ పతనంతో నాటకీయ పరిణామాలకు దారి తీసింది. ఆమె దేశం వదలి పారిపోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు 5న విద్యార్థులు పిలుపునిచ్చిన 'ఛలో ఢాకా' కార్యక్రమంతో వేలాది మంది ప్రజలు రాజధాని నగరం చేరుకున్నారు. ప్రధానమంత్రి నివాసానికి కదం తొక్కారు. పౌర నిరసనకారులపై తమ సైన్యం కాల్పులు జరప బోదని ప్రధాన సైనికాధికారి హసీనాకు తెలియ జేయడంతో అప్పటికే కదలిపోతున్న ఆ పాలనా వ్యవస్థకు ఆఖరి దెబ్బ తగిలింది.***



హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ 2009 పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి అధికారానికి వచ్చిన తర్వాత ఆమె 15 ఏళ్ల పరిపాలన అంతకంతకు నిరంకుశత్వం వైపు నడిచింది. 2004 జనవరి ఎన్నికలతో సహా మూడు పార్లమెంటు ఎన్నికలు ఏకపక్షంగా అవామీ లీగ్‌కు అనుకూలంగా జరిగాయి. ప్రతిపక్ష పార్టీలను అణచివేయడం భారీ ఎత్తున సాగింది. రాజ్య వ్యవస్థలు బాహాటంగా పాలక పార్టీకి కొమ్ము కాశాయి. మొత్తంపైన ఇనుప కవచాల నిరంకుశ ప్రభుత్వం రూపు దాల్చింది. మీడియా, పౌర సమాజం, అన్ని రకాల అసంతృప్త స్వరాలు నిర్బంధాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. అరెస్టులు, జైళ్ల పాలవటం సంభవించింది. ఆమె 15 ఏళ్ల పాలన తొలి దశాబ్దిలో బంగ్లాదేశ్ కొంత అభివృద్ధి సాధించిన మాట నిజమే. వస్త్ర ఎగుమతులు జిడిపి పెరుగుదలకు కారణమయ్యాయి. అయితే ఈ అభివృద్ధి ఫలాలను చాలా కొద్దిమందితో కూడిన వర్గమే చేక్కించుకుంది వారిలో చాలామంది అవామీ లీగ్ చట్రంలో భాగమయ్యారు. హసీనా సన్నిహిత అంతర్గత ముఠా సభ్యులయ్యారు. అపర కుబేరుల అత్యధిక పెరుగుదలలో తదుపరి ఐదేళ్లలో ప్రపంచంలోనే మూడో స్థానంలో బంగ్లాదేశ్ ఉంటుందని 2019లో అంచనా వేసే పరిస్థితి వచ్చింది. ఇందుకు పూర్తి భిన్నంగా ప్రస్తుతం అక్కడ కోటి 80 లక్షల మంది యువజనులు పని లేకుండా ఉన్నారు. ఉద్యోగాలు వచ్చే అవకాశాలు లేని అంధకార పరిస్థితి. అవినీతి పరాకాష్టకు చేరింది. అవినీతిపరులైన వ్యాపార ముఠాలతో పాలక రాజకీయ పార్టీ నేతల కుమ్మక్కు మధ్య తరగతిని మేధావి వర్గాన్ని దూరం చేసింది, మొదట్లో ఉద్యోగ కోటాలు పాలక పార్టీకి ప్రయోజనం కలిగించ డానికే నన్న భావనతో అందుకు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమంగా మొదలైంది. అయితే ప్రభు త్వం నిర్బంధానికి పాల్పడ డంతో అది సర్కారును మొదలంటా కూల్చివేసే విస్తృత ప్రజా ఉద్యమంగా మారింది.

**తాత్కాలిక ప్రభుత్వం**

వెనువెంటనే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు ఎటూ తప్పనిసరిగా జరగాల్సిందే. ఏదో ఒక విధమైన పాలనా వ్యవస్థ ఉంటేనే శాంతి భద్రతలను పునరుద్ధరించటం సాధ్యం. గ్రామీణ బ్యాంకు వ్యవస్థాపకుడు, నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ విద్యార్థుల అభ్యర్థన మేరకు తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా ఉండటానికి అంగీకరించారు. ఈ ప్రభుత్వంలోని ఇతర సలహాదారులనూ ఎక్కువ ఆలస్యం లేకుండా నియమించాల్సి ఉంటుంది. పౌర సమాజ సంస్థలు, వామపక్ష రాజకీయ వ్యక్తులతో సహా విద్యార్థి నాయకత్వం ఒక ప్రజాస్వామిక ప్రక్రియకు మారేందుకు కలిసికట్టుగా పనిచేయాలి. జమాతే ఇస్లామీ ఇతర ఛాందస శక్తులు సమాజంలో బలంగా పాతుకొని ఉన్నాయి కనుక ఇది మరింత అవసరమవుతుంది. మితవాద చాందస శక్తులు అధికారం హస్తగతం చేసుకోకుండా అడ్డుకోవడానికి అన్ని ప్రజాస్వామిక శక్తుల విశాల ఐక్యత మాత్రం అత్యవసరం.

ప్రస్తుత నేపథ్యంలో అమెరికా పాత్ర ఏమిటి అన్నది బంగ్లాదేశ్ లోని వామపక్ష ప్రగతిశీల శక్తులు నిశితంగా చూడవలసి ఉంటుంది. హసీనా అనంతర ఎజెండాను ప్రభావితం చేసేందుకు అమెరికా తల దూర్చే అవకాశం ఎక్కువ. బంగ్లాదేశ్‌ను తన ఇండో పసిఫిక్ వ్యూహానికి అనుగుణంగా మలచుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తుంది. భారతదేశంలో షరామామూలుగా ఆర్ఎస్ఎస్ బిజెపి కూటమి, కార్పొరేట్ మీడియా బంగ్లాదేశ్ పరిణామాలపై కుట్ర సిద్ధాంతాలు అల్లడం మొదలుపెట్టింది. వాటిలో బాగా ప్రచారంలో ఉన్నది, గోడి మీడియా మరీ మరీ వినిపిస్తున్నది ఒకటే. ఐ.ఎస్.ఐ, చైనా కల్సికట్టుగా కుట్ర పన్ని హసీనాను కూలదోశాయనే. ఇందుకోసం ఏవో సాక్ష్యాలు అనబడేవి చాలానే ప్రదర్శిస్తున్నారు. భారతదేశ పాలక వర్గాలకు, వాటి మీడియాకు సంబంధించినంత వరకు విస్తృత ప్రజా ఉద్యమం పెంపొంది బంగ్లాదేశ్లో ఒక పచ్చి అవినీతి ప్రభుత్వాన్ని కూలదోయడం ఊహించలేని విషయంగా ఉంది. షేక్ హసీనా భారత దేశానికి సన్నిహితురాలు గనక భౌగోళిక రాజకీయ కుట్రలు జరిగాయని చెప్పటం వారికి పెద్ద పని కాదు. అలాంటి వైఖరి బంగ్లాదేశ్ ప్రజల విజ్ఞతను, స్వతంత్ర సంకల్పాన్ని కించపరచడమే. భారతదేశంలో ఉన్న ప్రభుత్వ స్వభావాన్ని బట్టి బంగ్లాదేశ్‌లో పరిణామాలను హిందుత్వ కళ్లద్దాలతో చూడటం తప్పనిసరి. బిజెపి నాయకుడు, పశ్చిమ బెంగాల్ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు సుబేందు అధికారి బంగ్లాదేశ్ లోని కోటి మంది హిందువులు ఇండియాలో ఆశ్రయం కోసం వస్తారని ప్రకటించారు. వారికి భారత పౌరసత్వం ఇవ్వడం కోసం పౌరసత్వ చట్టాన్ని సవరించాలని రెచ్చగొట్టే ప్రకటన కూడా చేశారు. బంగ్లాదేశీయులను చొరబాటుదారులుగా తరచూ అభివర్ణించటం బంగ్లాదేశ్ ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో భారతదేశం పట్ల వ్యతిరేక భావనలు పెరగడానికి ఒక కారణం. హోంమంత్రి అమిత్ షా వారిని కీటకాలుగా పేర్కొనడం మర్చిపోలేము. బంగ్లాదేశ్‌లో వచ్చిన ప్రజా వెల్లువను అపఖ్యాతికరమైన రీతిలో, రెచ్చగొట్టే విధంగా ప్రతికూలంగా మీడియా, హిందుత్వ ప్రతినిధులు చిత్రించటం భారత వ్యతిరేక భావనలను మరింత పెంచడానికి, ఎగదోయడానికి కారణం అవుతుంది. ఎలాంటి వ్యాఖ్యకు కానీ చర్యకు కాని దిగకపోవడమే మోడీ ప్రభుత్వ ముందున్న అత్యుత్తమ మార్గం. బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాలపై తాత్కాలిక ప్రభుత్వంతో భారతదేశం మోడీ ప్రభుత్వం ఓపికతో కలిసి పనిచేయాలి. శాంతి స్థాపన, సాధారణ పరిస్థితి కోసం తీసుకునే అన్ని చర్యలకు మద్దతునివ్వాలి.

## ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి





**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులపై గత ప్రభుత్వాలు అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెట్టే రాజు ప్రభుత్వాన్ని కోరారు. కొవ్వూరు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ద్వి కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ గారి గృహానికి విచ్చేసిన రాష్ట్ర హోంశాఖ మాత్యులు వంగలపూడి అనితను కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు సమక్షంలో ఎమ్మార్పీఎస్ దళిత నాయకులు కలిసి కేసులు ఎత్తేయాలని వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో తీర్మానం చేయటం పట్ల యావత్తు మాదిగ సమాజం హర్షం వ్యక్తం చేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు.

**ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్**

వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళుగా చేసిన పోరాట ఫలితంగా ఎస్సి వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చిందని మూడు దశాబ్దాలుగా చేస్తున్న ఈ పోరాటంలో ఎన్నో అక్రమ కేసులు పడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని ఈ కేసుల వల్ల విద్యార్థులు యువకులు ఉద్యోగాలకు ఉన్నత చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతుందని వీటి వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి త్వరతిగతిన కేసులు ఎత్తివేసేలా చొరవ చూపాలని కోరగా హోం మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ జిల్లా అధ్యక్షులు గెడ్డం వినోద్ కొడమంచిలి విజయ్ కుమార్, పెనుమాక జయరాజు, గెల్లా సురేష్, పెద్దాడ ఏసు బుజ్జి, కడిమి శ్యాం కుమార్, గెల్లా మణిదీప్, గాలింకి రాము, మనెల్లి నానీ, పసలపూడి హరిబాబు, గెడ్డం దిలీప్ ముప్పిడి డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన





**చాగల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొవ్వూరు ఐసిడిఎస్ సిడిపిఓ మమ్మీ అన్నారు.మాదక ద్రవ్యాల వినియోగంపై చాగల్లు వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ క్రైమ్ ద్వారా మహిళలపై జరుగుతున్న నేరాలుపై స్త్రీ శిశు సంక్షేమ ద్వారా ఎటువంటి న్యాయం పొందవచ్చు అనే అంశాలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మదకద్రవ్యాలు వైపు అలవాటు పడకుండా తల్లిదండ్రులతో పాటు అన్ని శాఖల అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. చెడు అలవాటు నుంచి సరైన మార్గం వైపు విద్యార్థులను రూపుమాపేందుకు ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ పావని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎం.మెరికమ్మ, ఎంఈఓలు యు.గురునాథం సిహెచ్ సుభాకర్,ఐసిడిఎస్ సూపర్వైజర్లు పద్మావతి, శిరీష మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ వాయిస్

### ఉదయాన్నే ఇవి తింటే ఎంతో మేలు



ఉదయాన్నే తీసుకునే ఆహారం ఆరోజు ఉత్సాహంగా ప్రారంభం కావడంలో కీలకంగా పనిచేస్తుందని ఆహార నిపుణులు, వైద్యులు చెబుతుంటారు. చాలామంది ఉదయాన్నే కాఫీ, టీ, గ్రీన్ టీ వంటివి తాగుతుంటారు. అయితే ఐరన్ లోపం ఉన్నవారు వీటిని తీసుకుంటే శరీరం ఐరన్ గ్రహించడంలో సమస్య ఏర్పడుతుంది. ఈ కారణంగా ఐరన్ ఆధారిత ఆహారాలు తిన్నా అవి శరీరం గ్రహించలేదు. అందుకే ఐరన్ లోపం ఉన్నవారు ఉదయాన్నే కొన్ని ఆహారాలు తినడం మంచిదని ఆహార నిపుణులు చెబుతున్నారు. అవేంటంటే.. డైటీషియన్ ప్రకారం శరీరంలో ఐరన్ లోపం ఉంటే రోజూ ఉదయమే రెండు నానబెట్టిన ఖర్జూరాలను తినాలి. ఖర్జూరంలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. శరీరానికి పుష్కలంగా ఐరన్ అందిస్తుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం సమస్య నుండి బయటపడటానికి అర టీస్పూన్ సెలెరీని వేయించి నమలండి. సెలెరీలో క్రియాశీల ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి కడుపులోని ఆమ్లాలను మెరుగుపరచడంలో అలాగే అజీర్ణం, ఉబ్బరం, గ్యాస్ సమస్యలను తొలగించడంలో సహాయపడతాయి. ఎప్పుడూ జుట్టు రాలడం వల్ల ఇబ్బంది పడుతుంటే ఉదయాన్నే 2 స్పూన్ల బయోటిన్ మిక్స్ తీసుకోవచ్చు. బయోటిన్ మిక్స్‌లో జింక్, మెగ్నీషియం, బయోటిన్ వంటి సూక్ష్మ పోషకాలు ఉంటాయి. మొటిమలు, మచ్చలు, పిగ్మెంటేషన్‌తో బాధపడుతుంటే నానబెట్టిన సబ్జా గింజలను అర టీస్పూన్ తీసుకోవచ్చు. సబ్జా గింజలను ఒక గ్లాసు నీటిలో 10-15 నిమిషాలు నానబెట్టి, ఈ నీటిని త్రాగాలి. ఈ నీటిని రోజూ తాగడం వల్ల ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు పోతాయి. హైపో థైరాయిడిజం సమస్య ఉంటే ఉదయాన్నే బ్రెజిల్ నట్స్ తినవచ్చు. బరువు తగ్గాలని ప్రయత్నించే వ్యక్తులు ఉదయాన్నే పాలతో టీ తాగకూడదు. బరువు తగ్గడానికి కింది విధంగా టీ తయారు చేసుకుని తాగాలి. ఒక చెంచా బ్లాక్ టీ, సగం దాల్చిన చెక్క, సగం నిమ్మకాయ రసం, ఒక చెంచా ఆర్గానిక్ తేనె, 4-5 పుదీనా ఆకులు తీసుకోవాలి. ముందుగా ఒక కప్పు నీళ్లు మరిగించి అందులో బ్లాక్ టీ, దాల్చిన చెక్క ముక్క వేయాలి. 5-6 నిమిషాలు ఉడికిన తర్వాత వడగట్టి కప్పులోకి తీసుకుని నిమ్మరసం, తేనె, పుదీనా ఆకులు వేసి గోరువెచ్చగా సిప్ చేస్తూ తాగాలి. ఈ టీలో జీరో కేలరీలు ఉంటాయి. దీని కారణంగా బరువు తగ్గడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుంది. అంతేకాదు.. అపానవాయువు, గ్యాస్ సమస్య నుండి కూడా ఉపశమనం కలిగిస్తుంది.

## భక్తి వాయిస్

# నల్లదారం ఎందుకు కట్టుకుంటారు?

చెడు దృష్టి పడకుండా, దిష్టి పడకుండా ఉండేందుకు చాలామంది తమ ఎడమ కాలికి నల్లదారం ధరిస్తూ ఉంటారు. దీన్ని ధరించడం వల్ల ప్రతికూల శక్తి తొలగిపోతుందని నమ్ముతారు. అయితే కొందరికి ఈ నల్లదారం ధరించిన తరువాత మంచి జరగకపోగా ఇబ్బందులు పెరుగుతాయి. అసలు ఎందుకు ఇబ్బందులు వస్తున్నాయో తికమక పడేవారు ఉంటారు. నల్లదారాన్ని ఎందుకు ధరిస్తారో.. దీన్ని ఎవరు ధరించకూడదో తెలుసుకుంటే..

**నల్లదారం ఎందుకు ధరిస్తారు?**

హిందూమతంలో నలుపు రంగును శనిదేవుడికి ప్రీతికరమైనదిగా భావిస్తారు. కొందరికి ఈ దారం ధరించడం వల్ల మంచి జరుగుతుంది. కానీ కొందరికి మాత్రం ఇబ్బందులు వస్తాయి. నల్లరంగు దారం ఎడమకాలికి ధరిస్తే చెడు దృష్టి, దిష్టి కలగవని అంటారు. అలాగే చెడు శక్తుల నుండి కూడా నలుపు రంగు దారం రక్షణ ఇస్తుందని అంటారు.

నల్లదారం ఎవరు ధరించకూడదు?

**మేషరాశి :** మేషరాశి వారు నల్ల దారం ధరించకూడదు. ఇది సమస్యలను పెంచుతుంది. మేషరాశిని పాలించే గ్రహం అంగారకుడు. నల్ల దారం శని, రాహువులకు సంబంధించినదని నమ్ముతారు. శని, కుజుడు మధ్య మంచి సంబంధాలు జ్యోతిషశాస్త్రంలో ప్రస్తావించబడలేదు. ఇలాంటి పరిస్థితిలో నల్ల దారం ధరించడం వల్ల సమస్యలు పెరుగుతాయి.



**కర్కాటకం..**

కర్కాటక రాశి వారు నల్ల దారం ధరించడం మానుకోవాలి. కర్కాటక రాశికి అధిపతి చంద్రుడు. శని, రాహువుల మధ్య శత్రుత్వ భావన ఉంటుంది. కాబట్టి కర్కాటక రాశి వారు దీనిని ధరించకూడదు. నల్ల దారం ధరించడం వల్ల చంద్రుని శక్తి బలహీనపడుతుందని, ఇది మానసిక సమస్యలను కలిగిస్తుందని చెబుతారు.

**సింహం..**

సింహ రాశికి అధిపతి సూర్యుడు. ఈ రాశిచక్రం మూలకం అగ్ని. ఈ వ్యక్తులు కూడా నల్ల దారం ధరించకూడదు. కొన్ని కథల్లో సూర్య, శని గ్రహాలను తండ్రీకొడుకులు అంటారు. కానీ జ్యోతిష్యంలో వారిని శత్రువులుగా కూడా పరిగణిస్తారు. అందుకే నల్ల దారం ధరించకుండా ఉండాలి.

**వృశ్చికం..**

వృశ్చిక రాశి వారు నల్ల దారం ధరించకూడదు. ఈ రాశికి అధిపతి అంగారకుడు. ఈ వ్యక్తులు ఎటువంటి సలహా లేకుండా నల్ల దారం ధరించకూడదు. ధరిస్తే వారు ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటారు. ప్రతికూలత అక్కడ ఎదురవుతుంది.

# 15నుంచి 'పంచ పరివర్తన్' కోసం జనజాగరణ

## ఆర్ ఎస్ ఎస్ జిల్లా సంఘ చాలక్ డాక్టర్ కర్రి రామారెడ్డి వెల్లడి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** స్వాతంత్ర్య దినోత్సవం, రక్షా బంధన్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 15 నుంచి 'పంచ పరివర్తన్' పేరిట జనజాగరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ ఎస్ ఎస్) తూర్పు గోదావరి జిల్లా సంఘ చాలక్ డాక్టర్ కర్రి రామా రెడ్డి చెప్పారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలన్నారు. పంచ పరివర్తన్' లో భాగంగా ఇంటింటికి వెళ్లి కార్యకర్తలు చైతన్యం కలిగిస్తారని చెప్పారు. భారతీయ హిందూ సమాజం దృఢంగా, ఐక్యమత్యంతో జీవించడానికి అవసరమైన లక్షణాలు లోపించడం వలన ఇబ్బందులు వస్తున్నాయని, ముఖ్యంగా కులాల ఆధారంగా విడి పోవడం ద్వేష భావం నెలకొనడం ప్రతిబంధకంగా మారిందని ఆయన పేర్కొన్నారు. వృత్తిని బట్టి కులాలు వచ్చాయని, అయితే కొన్ని కులాల పట్ల అంట రాని తనం చూపడం తగదన్నారు. కులాలు వేరైనా అందరూ ఒక్కటే అన్న భావన కలిగించేందుకు పంచ పరివర్తన కార్యక్రమంలో చైతన్యం కల్గిస్తామన్నారు. ఇక ఒక్కపుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవని , ప్రస్తుతం చిన్నాభిన్నమ కావడం వలన ఐక్యత కొరవడుతోందని డా రామారెడ్డి పేర్కొంటూ, మళ్ళీ పూర్వ వైభవం పొందడానికి అవగాహన కల్పిస్తామన్నారు. ఇక పర్యావరణ సమస్య రోజురోజుకి పెరిగిపోతున్న నేపథ్యంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, పర్యావరణ సమతుల్యం కాపాడడానికి ఎవరికి వారు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. కొన్ని వస్తువులు దిగుమతి చేసుకోవడం తప్పనిసరి అయినప్పటికీ స్వయం సమృద్ధి దిశగా దేశీయ ఉత్పాదన పెంచి ఎగుమతులు చేసే స్థాయికి దేశాన్ని తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని డా రామారెడ్డి పేర్కొంటూ అందుకే దేశీయత భావన పెంపొందించాలని పరివర్తన్ లో ఈ అంశాన్ని చేర్చినట్లు ఆయన తెలిపారు. మానవతా విలువలు, నాగరిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా మాదక ద్రవ్యాల వల్ల యువత పాడై పోతున్న పరిస్థితిపై ప్రజలకు వివరిస్తామని చెప్పారు. విలువలతో కూడిన విద్య వల్ల సమాజం అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని యువత గుర్తించి, మంచి నడవడిక అలవరచుకోవాలి డా. రామారెడ్డి కోరారు. ఆర్ ఎస్ ఎస్ ఆంధ్ర ప్రాంత కార్యకారిణి ఓలేటి సత్యనారాయణ మాట్లాడుతూ కులాల అంతరం పోవాలన్నారు. బాహ్యంగా అస్పృశ్యత కనిపించకపోయినా మానసికంగా కూడా అంటరానితనం భావన పోవాలని తద్వారా ప్రతి వ్యక్తి మానవతా విలువలకు ప్రతినిధి కావాలని ఆయన పేర్కొన్నారు. ఇందుకు జన జాగరణ కార్యక్రమం ఎంతో దోహద పడుతుందన్నారు. మానవతా విలువల కోసం ఆలోచనా పరులంతా కల్సి పనిచేయాలని, తమతో ఎవరు వచ్చినా కల్సి పనిచేస్తామని ఆయన చెప్పారు. విలేకరుల సమావేశంలో ఆర్ ఎస్ ఎస్ గోదావరి విభాగ్ సంఘ్ చాలాక్ రిమ్మలపూడి సుబ్బరాజు, సహ కార్యదర్శి వాడ్రేవు మాణిక్యాల రావు, మోహన్ కృష్ణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాల బారిన పడొద్దు

### లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించండి
### సంహిత డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు డాక్టర్ అనసూరి ప్రియాంక సూచిన

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులు తమ జీవితంలో లక్ష్యాలను ఎంచుకుని వాటిని చేరుకోవాలని జేసీఐ ఇండియా జోన్ ట్రైనర్, జీవనశైలి స్పెషలిస్ట్, శ్రీలత హాస్పిటల్స్ అధినేత డాక్టర్ అనుసూరి ప్రియాంక సూచించారు. సంహిత డిగ్రీ కాలేజీ లో డిగ్రీ ఫైనల్ఇయర్ పిల్లలకు, జేసీఐ రాజమండ్రి పెర్ల్స్ ప్రెసిడెంట్ జేసీ గీతా రామదేవు ఆధ్వర్యంలో డాక్టర్ అనుసూరి ప్రియాంక , ఎండి(జనరల్ మెడిన్) డ్రగ్ అడిక్షన్ మీద అవగాహన శిక్షణ ఇచ్చారు. 150 మండి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అనసూరి ప్రియాంక మాట్లాడుతూ రోజూ కాఫీ తీసుకునే అలవాటు ఉన్నవాళ్లు, సమయానికి కాఫీ తాగకపోతే ఏదో కోల్పోయినట్లు ఉంటారని గుర్తుచేశారు. కాఫీ వలన ప్రమాదం లేనప్పటికీ అడిక్షన్ అవ్వడం ఉంటుందని అయితే పొగ తాగడం, ఆల్కహాల్ సేవించడం వంటివాటి వలన రోగాలు చుట్టుముడతాయన్నారు. ఇక గంజాయి వంటి మాదక ద్రవ్యాలు తీసుకుంటే అడిక్షన్ అయిపోయి జీవితం దెబ్బతింటుందని అన్నారు. అందుకే మాదక ద్రవ్యాల జోలికి అస్సలు వెళ్లవద్దని ఆమె సూచించారు. స్మోకింగ్, ఆల్కహాల్ వంటివాటికి కూడా దూరంగా ఉండాలన్నారు. కేవలం చదువుపైనే దృష్టి సారించి మంచి స్థానానికి చేరుకోవాలని డాక్టర్ ప్రియాంక సూచించారు.



## "లో వోల్టేజీ" నివారించండి.. నాణ్యమైన విద్యుత్ ఇవ్వండి...

### రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్‌కి వినతి పత్రం

**కోరుకొండ, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గ ప్రజలకు "లో వోల్టేజీ"సమస్య నివారించడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చెయ్యాలని విశాఖపట్నం ఏపీఈపిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీరాజ్‌ను మంగళవారం రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించమన్నారు. రాజానగరం నియోజక వర్గంలో మూడు మండలాల్లో చేపట్ట వలసిన విద్యుత్ సరఫరాకు సంబంధించిన వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యను పరిష్కరించడానికి పునరుద్ధరణ చేయ బడిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డిఎస్ఎస్) కింద కొత్త 33/11 కె.వి. సబ్‌స్టేషన్లను రాజానగరం మండలం ముక్కినాడ, మరొకటి నన్నయ్య యూని వర్సిటీలో ఏర్పాటు చేయాలన్నారు. రాజానగరం నియోజకవర్గంలో కొత్తగా 104 ట్రాన్సఫార్మర్ లను మంజూరు చేసి విద్యుత్ అంతరాయం లేకుండాచూడాలన్నారు. నియోజకవర్గంలో రైతులు, గృహ వినియోగ దారులు, చిన్న మధ్య తరహా పారిశ్రామికవేత్తలు విద్యుత్ సమస్యలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

## ఎంపవర్ యువర్ లీగల్ డెస్క్ యాప్ ద్వారా న్యాయసహాయం పొందవచ్చు

### నూతన కార్యాలయాన్ని రాష్ట్ర హెూమ్ మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా ప్రారంభం



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** స్థానిక టి.నగర్ చింతలూరి వారి వీధిలో "ఎంపవర్ యువర్ లీగల్ డెస్క్ " కార్యాలయంను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూమ్ మంత్రి వంగలపూడి అనిత, రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరిలు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. సామాన్య, పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారితో పాటు అన్ని వర్గాల ప్రజల కోసం ఈ విభాగం పారదర్శవంతంగా న్యాయపరమైన సలహాలు అందించి అందరి మన్ననలను అందుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఎంపవర్ యువర్ లీగల్ డెస్క్ కార్యాలయం ద్వారా న్యాయవాదులు చిత్తశుద్ధితో ప్రజలకు న్యాయ సేవలు అందిస్తూ పార్టీపరంగా పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. డాక్టర్ అనుసూరి ప్రియాంక మాట్లాడుతూ ఎంపవర్ యువర్ లీగల్ డెస్క్ యాప్ ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. న్యాయ సలహాలు, సూచనలు, సంప్రదింపుల కోసం ప్రజలు ఎక్కడికో వెళ్ళనక్కర్లేదని ఈ యాప్ ద్వారా పూర్తి న్యాయ సహాయం పొందవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రూరల్ తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు అనపర్తి వీరభద్రరావు మాట్లాడుతూ న్యాయపరంగా ప్రజలకు ఎదురయ్యే సమస్యలను లీగల్ డెస్క్ అనే యాప్ లో న్యాయ సహాయం పొందవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపవర్ యువర్ లీగల్ డెస్క్ కార్యదర్శి గడ్డం రాజ్ కుమార్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు నరసింగ శ్రీనివాసు, రాష్ట్ర కార్యదర్శి సింగ్ సురేంద్ర ప్రసాద్ లు పాల్గొన్నారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నిమ్మలపూడి గోవిందు, శిలం గోవిందు, వెంకట్రావు, ఎం.సత్య శివప్రసాద్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీకి "మార్గాని చంటిబాబు"రాజీనామా



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** బహుజన ఉద్యమల ద్వారా చైతన్య పరచడానికి పనిచేసిన మార్గాని చంటిబాబు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 15 సంవత్సరాలుగా సామాజిక ఉద్యమాల్లో పని చేసిన తాను 2018 లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. వ్యక్తిగత కారణాల వలన రాజీనామా చేస్తున్నట్లు తెలియజేశారు. పార్టీలో చేరి మళ్ళీ రాజీనామా చేసే క్రమంలో తన శ్రేయోభిలాషులకు కాని, పార్టీవారికి కాని ఇబ్బంది కలిగిస్తే క్షమించాలని మార్గాని చంటిబాబు కోరారు. ఎప్పటి మాదిరి ఇకపై తాను చేసే సామాజిక ఉద్యమాలకు, సేవలకు అందరూ సహకరిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

## అమలాపురం ప్రెస్‌క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియాకు నూతన కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక



**అమలాపురంరూరల్, విశ్వంవాయిస్ :** అమలాపురం ప్రెస్‌క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మహ్మద్ బషీర్, ప్రధాన కార్యదర్శిగా కాకర సుధీర్, ఉపాధ్యక్షునిగా పొట్టుపోతు నాగేశ్వర రావు (నాగు), కోశాధికారిగా ఎస్వీఎస్‌హెచ్ హెచ్ హరిప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా మామిడిశెట్టి విష్ణుప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కడలి పల్లపురాజు, గౌరవ అధ్యక్షులుగా చొల్లంగి అప్పాజీ, సభ్యులుగా పరమట భీమామహేష్, గణపవరపు వీరవెంకటసత్యసాయి ప్రసాద్, అద్దంకి సత్యభాస్కరరావు, దొమ్మేటి వెంకట్, ఎమ్ఎస్ఏ హుస్సేన్(రాజా), ఆసు భరత్‌రామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులు కొర్లపాటి ప్రదీప్‌కుమార్, చొల్లంగి శేఖర్‌బాబు, ఎండీ బషీర్, కాకర సుధీర్, ప్రెస్‌క్లబ్ పెద్దలు టీకే విశ్వనాథ్, పిండి శేషు, చొల్లంగి అప్పాజీల ఆధ్వర్యంలో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని అమలాపురం ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షులు కొండేపూడి సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు రంబాల సత్యనారాయణ, టీకే విశ్వనాథ్, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గ సభ్యులు కొర్లపాటి ప్రదీప్‌కుమార్, సీనియర్ జర్నలిస్టులు చొల్లంగి శేఖర్ బాబు, మద్దింశెట్టి త్రిమూర్తులు, రంకిరెడ్డి రామకృష్ణ, పిండి శేషు, అబ్బాస్, ముక్కామల చక్రధర్, కాకిలేటి సూరిబాబు, మట్టపర్తి రమేష్, గారపాటి పండు బాబు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## భార్యను హత్య చేసిన భర్త



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో పాత ఎత్తిపోతల పథకం ప్రక్కన వివాహిత హత్య చేయబడిన ఘటన మంగళ వారం తెల్లవారు జామున జరిగింది. దేవీపట్నం మండలం దండంగి గ్రామానికి చెందిన చాట్ల జాన్ భార్య దివ్యభారతి పిల్లలతో కలిసి కొంతకాలంగా పురుషోత్తపట్నం గ్రామంలో పాన్ షాప్ నిర్వహిస్తూ ఉంటున్నారు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య కాపురంలో గొడవలు చోటుచేసుకున్నాయి. గతంలో భార్య ఫిర్యాదు మేరకు జాన్ జైలుకు వెళ్లి వచ్చాడు. తర్వాత కొంతకాలం కాపురం సజావుగానే సాగింది. గత 15 రోజులుగా ఇద్దరు మధ్య వివాదం వచ్చి వేరువేరుగా ఉంటున్నారు. మంగళవారం ఉదయం దివ్యభారతి బహిర్భూమికి వెళ్ళగా ఆమెపై అక్కడ దాడి జరిగింది. అరచేతుల మీద మెడమీద తలపై వెనుక భాగంలో కత్తితో నరికిన గాయాలు ఉన్నాయి. ఆమె భర్త ఈ దాడికి పాల్పడినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కోరుకొండ సీఐ ఆధ్వర్యంలో సీతానగరం ఇంచార్జ్ ఆనంద్ కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. జరిగిన ఘటనను చూసి స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. ఆమె భర్తను అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు.

## రాయపాటి దంపతుల కుమారుడు పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమం లో వృద్ధులకు అన్నదాన వితరణ

### వృద్ధులను అనాథలను ఆశ్రయం కల్పించాలి





**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరాదరణకు అవుతున్న వృద్ధులకు అనాథలకు ఆశ్రయం కల్పించాలని మానవీయ అనాథ, వృద్ధా ఆశ్రమం నిర్వాహకులు తానేటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కోరుకొండ మండలం నర్సాపురం గ్రామానికి చెందిన రాయపాటి చంద్రబాబు పావని పార్వతి దంపతులు తమ కుమారుడు హర్షిత్ రామ్ పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తానేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఏ విధమైన సహాయం లేకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 50 మంది వరకు ఉన్న మానవీయ వృద్ధాశ్రమానికి ప్రభుత్వం స్థలం కేటాయించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా రాయపాటి చంద్రబాబు, పావని పార్వతి దంపతులు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వృద్ధులను చూసి చలించిపోయామని తెలిపారు. నిరాదారణకు గురి అవుతున్న వృద్ధులను అక్కున చేర్చుకొని వారి అవసరాలుతీర్చి వైద్యం, భోజన, వసతి కల్పిస్తున్న నిర్వాహకులు తానేటి శ్రీనివాస్ కు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ఈ ఆశ్రమాన్ని గుర్తించి సొంత స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొగదల తలుపులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో కీలక మార్పులు

### సచివాలయాల స్థానే సంక్షేమ కార్యాలయాలు
### పంచాయతీ, సంక్షేమ కార్యాలయాలూ ఉంటాయి
### మిగులు సిబ్బందిని వివిధ శాఖల్లో సర్దుబాటు
### ఇప్పటికే సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిలిపివేత



శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తన పరిపాలనా విధానంలో ఎన్నో మార్పు చేర్పులకు శ్రీకారం చుడుతోంది. ముఖ్యంగా గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం హయాంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన పథకాలు, వాటి పేర్లు మార్పు వంటి వాటిపైన ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. మొత్తంగా గత వైసిపి పాలనా విధానాల ఆనవాళ్లను సమూలంగా చెరిపేసి, తమదైన నూతన శైలి కనిపించే విధంగా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించిన గ్రామ సచివాలయ వ్యవస్థ విషయంలో తాజాగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగానే సచివాలయ వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టాలని నిర్ణయించు కున్నదని ప్రచారంలో ఉంది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే గ్రామ, సచివాలయ వ్యవస్థను రద్దు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే వార్డు, గ్రామ సచివాలయాల పేరును మార్చబోతున్నట్లు సమాచారం. వీటి పేరును ఇకపై గ్రామ సంక్షేమ కార్యాలయాలుగా మార్చనున్నట్లు సమాచారం. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో ప్రక్షాళనలో భాగంగా రాష్ట్రంలోని 10,960 గ్రామ, 4,044 వార్డు సచివాలయాల విధి, విధానాల్లో భారీ మార్పులు, చేర్పులను ప్రభుత్వం చేపట్టినట్టు తెలుస్తోంది. ప్రతి గ్రామంలోనూ గ్రామ పంచాయతీ కార్యాలయాలు, గ్రామ సంక్షేమ కార్యాలయాలను విడివిడిగా ఏర్పాటు చేయాలని నిర్ణయించు కున్నారు. ఇవి రెండూ ప్రజలకు సమాంతరంగా సేవలు అందించేలా రూపకల్పన చేస్తున్నారు. గ్రామ సంక్షేమ కార్యాలయంలో డీడీవో బాధ్యతలను సంక్షేమ శాఖకు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఇవ్వాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

ఈ గ్రామ సంక్షేమ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ కార్యదర్శి, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వార్డు సచివాలయాల్లో పరిపాలన, శానిటరీ, విద్య, సంక్షేమ, ఆరోగ్య, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎం, వీఆర్వో ఉండేలా ప్రతిపాదించే అవకాశం ఉంది. గ్రామ సంక్షేమ కార్యాలయాల్లో ఐదుగురు ఉద్యోగులతో విధులు నిర్వర్తించే విధంగా విధి విధానాలను రూపొందిస్తోందని సమాచారం. గ్రామ సంక్షేమ కార్యాలయాల ద్వారానే ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు, జాబితాలను తయారీ చేయాలని, ఈ విషయంలో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్ళు లేకుండా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే సచివాలయాల్లో సిబ్బంది ప్రక్షాళనలో భాగంగా సచివాలయాల్లో మిగులు సిబ్బందిని ఇతర ప్రభుత్వ శాఖల్లోకి పంపేందుకు ఓ వైపు కసరత్తు చేస్తూనే, మరో వైపు ఈ వ్యవస్థలో కీలక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎవరి పనే వారే చేయాలని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ విధానాన్ని రద్దు చేయాలని చంద్రబాబు ఆదేశించారు.రాష్ట్రంలో ఉన్న 1.61 లక్షల మంది కార్యదర్శుల్ని ఇకపై వివిధ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం వాడుకో నుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంచాయితీల్లో తక్కువ మంది, పెద్ద పంచాయతీల్లో ఎక్కువ మంది ద్వారా ప్రజలకు సేవలందించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. గ్రామ సచివాలయ కార్యదర్శులను పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి తెచ్చే ప్రతిపాదనలు పరిశీలిస్తోంది. అందులోని కార్యదర్శులను ఇతర అవసరాలకు వాడుకునేలా కసరత్తు చేస్తోంది. మిగిలిన కార్యదర్శులను క్లస్టర్ వ్యవస్థలో వినియోగించు కోవాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమచారం. గ్రామ, వార్డు సచివాలయాల్లోని పలు పోస్టులను రద్దు చేసి వారికి సంబంధించిన మాతృశాఖలో విలీనం చేసే అవకాశం ఉందని రాష్ట్రంలో జోరుగా చర్చ నడుస్తోంది. ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, హార్టి కల్చర్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్ అసిస్టెంట్లు, పశు సంవర్ధక సహాయకులు తదితర పోస్టులను రద్దు చేసి క్లస్టర్ విధానంలో మాతృ శాఖలో పంపించేలా.. అలాగే పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ రాజ్ కింద గ్రామ పంచాయతీలకి పరిమితం చేసే ఆలోచన ఉందని ప్రచారంలో ఉంది. ఈ ప్రక్రియ మొత్తం సెప్టెంబర్ 30 లోపు పూర్తి చేసి, అక్టోబర్ 2 న భారత జాతిపిత మహాత్మా గాంధీ జయంతి దినోత్సవం నుండి కొత్త పరిపాలనా విధానంను అమలులోకి తేవాలని ఇప్పటికే ప్రభుత్వం అంతర్గతంగా చకాచకా కార్యాచరణ అమలు చేస్తోందని ప్రచారంలో ఉంది. అయితే ఇదే అక్టోబర్ 2 న 2019 న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను అమలులోకి తేవడం గమనార్హం.

## ప్రతి ఒక్కరు దేశభక్తిని పెంపొందించు కోవాలి- నీరుకొండ.



కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్: ప్రతి ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలని రాజానగరం నియోజకవర్గ భాజపా కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు. మంగళవారం రాజానగరంలో ఎన్డీఏ నాయకులు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆజాద్ క అమృత్ మహెూత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని రాజానగరం ప్రధాన రహదారుల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నీరుకొండ మాట్లాడుతూ చిన్నతనం నుండి ప్రతి ఒక్కరు పెద్దల యందు వినయ విధేయతలతో పాటు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఎందరో మహా నాయకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి స్వాతంత్ర్యాన్ని మనకు అందించారని, వారి వీర గాధలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో భాజపా రాష్ట్ర నాయకులు ఏపీఆర్ చౌదరి, ఎన్డీఏ నాయకుల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర నాయకులు అడబాల గణపతి,మోది సత్తిబాబు, సర్పంచ్ మద్దాల పెద్దమ్మాజీ రమణ, బదిరెడ్డి రాజా, బుద్ధ శ్రీను, పచారి నరసింహమూర్తి, నీలపాల వెంకన్న, తగరంపూడి గణపతి, తన్నిరు తాతాజీ, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ శిక్షణకు డుమ్మా కొట్టిన సర్పంచులు ...!

### మండుతున్న ఎండల్లో క్షేత్ర పరిశీలకు దూరం
### శిక్షణక కార్యదర్శుల హాజరు మాత్రం ఫుల్

శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ బీపంచాయతీలను, సచివాలయాలను బలోపేతం చేసేందుకు పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు సోమవారం నుంచి శిక్షణను ఇస్తున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ ఆయా మండలాల వారీగా మూడు రోజుల పాటు ఈ శిక్షణను అందిస్తున్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే తాజా శిక్షణను సోమవారం ఉదయం ప్రారంభించారు. ఇది మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. మొదటి రోజు శిక్షణలో పరిచయంతో ప్రారంభించి సర్పంచులు, కార్యదర్శులకు వారి విధులు, బాధ్యతలు, అభివృద్ధిలో వారి పాత్ర, పొదుపు సంఘాల సభ్యులు, ప్రజల భాగస్వామ్యం, జిపిడిపి ప్రణాళిక, పంచాయతీ సమావేశాలు, తీర్మానాలు వంటి పలు వివిధ అంశాలపై జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్సు పర్సన్లు అవగాహన కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తి స్థాయిలో శిక్షకులు అన్నవరం పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శి జయంతి వెంకట శివరామకృష్ణ, కత్తిపూడి పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి, ఈ శిక్షణపై ప్రత్యేకంగా జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన అన్నవరం సచివాలయం 2 కార్యదర్శి వెదురుపాక సత్యనారాయణ శిక్షణనిచ్చి అవగాహన కల్పించారు. ఇక రెండో రోజు మంగళవారం పారిశుద్ధ్యం నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ, వర్మీ కంపోస్టు తయారీ, మార్కెటింగ్, క్షేత్ర స్థాయి పర్యటన, సమీపంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల సందర్శనను చేపట్టారు. అయితే మొదటి రోజు శిక్షణకు పంచాయతీ సర్పంచులు హాజరు కాగా రెండో రోజు శిక్షణకు మాత్రం సర్పంచులు హాజరు కాలేదు. మండలం మొత్తం మీద 14 పంచాయతీలు ఉండగా వీరు అందరూ కూడా కండగుత్తగా డుమ్మా కొట్టారు. మండల పరిషత్తు కార్యాలయంలో శిక్షణా తరగతులకు బదులు క్షేత్ర స్థాయిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల సందర్శన కావడం, పైగా ఎండలు మండిపోవడం కారణం కాబోలు సర్పంచులు హాజరు కాలేదు. అయితే శిక్షకులు, శిక్షణార్ధులకూ మధ్యాహ్నం భోజనం, తేనీరు, అల్పాహారం వంటి సౌకర్యాలను మాత్రం లోటు లేకుండా కల్పిస్తున్నారు. ఈ శిక్షణలోని వివిధ కార్యక్రమాలను ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఈవోపీఆర్డీ జయంతి వెంకట శివరామకృష్ణ పర్యవేక్షించారు



## పలువురిని పరామర్శించిన జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి

సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్: తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వెదురుపల్లి గ్రామానికి చెందిన బొబ్బ రత్తయ్య, సీతానగరం గ్రామానికి చెందిన నేలపల్లి అప్పన్న అనారోగ్యం కారణంగా రాజమండ్రి ప్రభుత్వ హాస్పిటల్ నందు వైద్యం చేయించుకుంటున్న విషయం తెలుసుకుని వారిని పలకరించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## భారతీయుడి వేషధారణలో 78 జాతీయ జెండాలను సృష్టించి దేశభక్తిని చాటుకున్న చిన్నారులు

### ఆకట్టుకున్న నాలుగు సంవత్సరాల చిన్నోడు ఇంద్రజాలం



కొత్తపేట ఆత్రేయపురం ఆగస్టు 13. విశ్వం వాయిస్ న్యూస్.ర్యాలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి మ్యాజిక్ హౌస్ లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహెూత్సవంలో భాగంగా నాలుగు సంవత్సరాల ప్రపంచ రికార్డు సాధకుడు బళ్ల రుషిత్ తన తాత శ్యామ్ జాదూగర్ మేనమామ మోహిత్ లతో కలిసి 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని చేసిన ఇంద్రజాల ప్రదర్శన విశేషంగా కట్టుకుంది.ఈ సందర్భంగా రుషిత్ మూడు మతాలు సమానమంటూ మెడలో శిలువ,నెత్తిపై మహమ్మదీయ టోపీ,హిందూ వస్త్రధారణతో భారతీయుడి వేషధారణలో 78 జాతీయ జెండాలను సృష్టించి దేశభక్తిని చాటుకున్నాడు అని శ్యాం కుమార్ తెలియ చేశారు

# క్యాన్సర్‌పై అవగాహన ఎంతో అవసరం

### - విశ్రాంత మున్సిపల్ ఆరోగ్య అధికారి ఎమ్వీఆర్ మూర్తి
### - క్యాన్సర్ ర్యాలీ ని ప్రారంభించిన పీఎంపీ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు

రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్బీకమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పియంపి అసోసియేషన్) రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం తూర్పుగోదావరి జిల్లా శాఖ మరియు ఆదిత్య మహిళ డిగ్రీపీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదిత్య కళాశాల సెమినార్ హాల్లో క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ముఖ్య అతిథిగా మున్సిపల్ కార్పోరేషన్ ఆరోగ్య విశ్రాంత అధికారి,పీఎంపీ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారు ఎమ్వీఆర్ మూర్తి పాల్గొని మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన ఎంతో అవసరమని క్యాన్సర్ కు కారణమైన ప్రస్తుత ఆహార నియమాలు,మద్యపానం, ధూమపానం ముఖ్యంగా ప్లాస్టిక్ ను విడనాడాలని సూచించారు.గౌరవ అతిధులు గా స్థానిక జీవీఎస్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ కె రామ్ గోపాల్ తేజ హాజరై మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువగా ఇబ్బందులకు గురవుతున్న క్యాన్సర్ వ్యాధి తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులువని గొంతు, కాలేయ క్యాన్సర్,ప్రేగులకు సంబంధించిన క్యాన్సర్ ల లక్షణాలు తెలిపారు, డాక్టర్ మాణిక్యాంబ మాట్లాడుతూ మహిళలకు వచ్చే రొమ్ము,గర్భాశయ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ల గురించి వివరించారు.పదమూడు సంవత్సరాల వయస్సు లో మహిళలకు హెచ్పీవి వ్యాక్సిన్ వేయించడం వలన ఈ క్యాన్సర్ లను నిరోధించవచ్చని అన్నారు. అనంతరం పీఎంపీ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ క్యాన్సర్ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు జెండా ఊపి ప్రారంభించి మాట్లాడుతూ నేడు క్యాన్సర్ పై ప్రజలకు అవగాహన కల్పించుటకు రాష్ట్ర స్థాయిలో పీఎంపీ సభ్యులు ఏర్పాటు చేస్తున్న అవగాహన కార్యక్రమాలకు సహకారాన్ని అందిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రహమాన్ మాట్లాడుతూ పీఎంపీలు రాష్ట్ర వ్యాప్తం గా ప్రజలందరికీ క్యాన్సర్ పై అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటి రాజు మాట్లాడుతూ ఈరోజు ప్రస్తుత జనాభాలో పదిమందిలో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్నారని, దీనిపై ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవాలని,రాష్ట్రంలో 40 వేల నుంచి 70 వేల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని 50 వేల మంది చనిపోతున్నారని,ప్రభుత్వ అంచనాకు అందకుండా 1.5 మంది క్యాన్సర్ రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. ఈనెల ఆగస్టు 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజలను ఆరోగ్యంగా ఉంచాలని అందరూ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడాలని ఉద్దేశంతో పారామెడికల్ సిబ్బందితో ఇంటింటికి క్యాన్సర్ నిర్ధారణ చేయు కార్యక్రమం, టెస్టులు చేయు కార్యక్రమం ప్రారంభిస్తున్నారు, కనుక ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో జగన్ ప్రభుత్వం భారీ స్కాం

▸▸ సుమారు రూ.700 కోట్ల టీడీఆర్ బాండ్ల అవినీతి ▸▸ జగనే ప్రధాన సూత్రధారి ▸▸ సిఐడి విచారణ జరుగుతుంది ▸▸ మాజీ మంత్రి కారుమూరి, బాధ్యులైన అధికారులకు శిక్ష తప్పదు ▸▸ ఎమ్మెల్సీ దువ్వాడ రాజీనామా చేస్తారా? జగనే సాగనంపుతారా? ▸▸ అగ్రిగోల్డ్ ఆస్తుల మేతలో మాజీమంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ ఎ2. ▸▸ వైసీపీలో చాలామంది 420 లు ఉన్నారు ▸▸ నాడు శాసనమండలి వద్దన్న జగన్ బొత్సాను మండలికి ఎలా పంపిస్తారు? ▸▸ రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్రంలో నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతాం ▸▸ మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్: వైసీపీ పాలనలో రూ.700కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అసలు సూత్రధారి అని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆరోపించారు. ఈ స్కాంలో విషయంలో మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు కీలకపాత్ర పోషించినప్పటికి తెరవెనుక అసలుకథనడిపింది జగనే అనేది వాస్తవమన్నారు. టీడీఆర్ బాండ్ల స్కాంపై సీఐడి విచారణ జరుగుతుందని, అధికారులతోసహా దీనికి బాధ్యులైన వైసిపి వారందరికి శిక్ష తప్పదని అన్నారు. మంగళవారం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మీడియాతో మాట్లాడుతూ టీడీఆర్ బాండ్ల దోషులను తమ ప్రభుత్వం వదిలే ప్రసక్తి లేదన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కు కుటుంబం పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి గౌరవంగా అతనితో రాజీనామా చేయించి ఇంటికి పంపాలని సూచించారు. పెద్దల సభలో ఉన్నవారే ఈ మధ్య కాలంలో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, రేపు పెద్దలసభలోకి దువ్వాడ శ్రీనివాస్ ఏ ముఖం పెట్టుకొని వచ్చి సమాధానం చెబుతానని ప్రశ్నించారు. అసలు దువ్వాడ కాని, జగన్ కాని సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నిలదీశారు. రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ వైసీపీకి సమాధి కట్టారని, ఇప్పుడు దువ్వాడ వ్యవహారంతో ఆ పార్టీ ప్రజల్లో మరింత దిగజారిందన్నారు. ఆనాడు శాసనమండలి వద్దని రద్దు చేస్తామని చెప్పిన జగన్ ఇప్పుడు బొత్స సత్యనారాయణను శాసనమండలి ఎన్నికల్లో పోటీకి ఎలా నిలబెడుతున్నారని ప్రశ్నించారు. పెద్దలసభకు ఇలాంటివారంతా అవసరమా అన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాహా చేసిన కేసులో మాజీమంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ ఎ2 అని, అగ్రిగోల్డ్ ఆస్తులు పందికొక్కుల్లా మేసేశారని మండిపడ్డారు. నాటి జగన్ పాలనలో మంత్రులంతా ఇలాంటి వారేనని, ఒకమంత్రిగంటా అరగంటా అని అసభ్యంగా మాట్లాడారని గుర్తు చేశారు. వైసీపీ వారిలో చాలామంది 420 లని ఆరోపించారు. వారంతా చేసిన అవినీతి ఒకటొకటిగా బయటకు వస్తున్నాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అనేనానుడి వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డికి అక్షరాల సరిపోతుందన్నారు. 2024 ఎన్నికల్లో కేవలం 11 సీట్లు మాత్రమే వచ్చిన తనకు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదా కట్టబెట్టాలంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి లేఖ రాయడం హాస్యాస్పదమని విమర్శించారు. ఆ లేఖలో తన రాజకీయ అజ్ఞానాన్ని జగన్ ప్రదర్శించారని, ప్రతిపక్ష నేత హోదా పొందాలంటే 10 శాతం సీట్లు పొందాలన్న నిబంధన ఎక్కడా లేదు కదాఅని స్పీకర్ ను ప్రశ్నించడం విడ్డూరమన్నారు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిని రాష్ట్రంలోనే నెంబర్ వన్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆసుపత్రికి వచ్చేవారికి మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తామన్నారు. పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు.. వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అవగాహన లేక ఈ ఆసుపత్రిని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. టీబీ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తామని,బేబీ కిట్లు మళ్ళీ ఇస్తామని చెప్పారు. నెలకో,పదిహేను రోజులకొకసారి ఆసుపత్రిని సందర్శించాలనుకంటే వారానికి ఒకసారి రమ్మని రోగులు అడుగుతున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. ఆసుపత్రి కమిటీ వేస్తున్నామని,గత ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీని కమిటీ సమావేశానికి ఆహ్వానించేవారుకాదని తెలిపారు. సదరన్ సర్టిఫికేట్ల విషయంలో కలెక్టర్ శ్రద్ధ తీసుకుని వారికి న్యాయం చేస్తున్నారని అన్నారు. వారందరికీ రూ.15 వేలు పెన్షన్ వచ్చేలా చూస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రైవేటు అంబులెన్స్ అడిగేవారి సంగతి తేల్చుతానని హెచ్చరించారు. కిడ్నీ బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రుడాలో జరిగిన అవకతవకల గురించే కాదు,ఎక్కడ తప్పు జరిగినా చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పష్టం చేశారు. నామవరంలో 1200 గృహాలు త్వరలో ఇస్తామని మంత్రి నారాయణ చెప్పారని తెలిపారు. జనప్రియ లే అవుట్ లో ఫ్రీ హోల్డ్ పేరుతో భూములను దోచేశారుని ఆరోపించారు. ఇకవారి దందాలు సాగనివ్వకుండా చూస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయన ఆసుపత్రికి వచ్చిన వారితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టీడీపీ నాయకులు మరుకుర్తి రవి యాదవ్, మజ్జి రాంబాబు, కొయ్యల రమణ, కడలి రామకృష్ణ, కొత్తల వీర వెంకట రామ కిషోర్, హరి బెనర్జీ, సలాది ఆనంద్, పొలకి పరమేష్ తదితరులు పాల్గొన్నారు

## సమాజాన్ని ప్రభావితం చేయగల కవి వెంకట్



అంబాజీపేట ( విశ్వం వాయిస్ న్యూస్ ప్రతినిధి) సమాజానికి దిశా నిర్దేశం చేయగలిగే శక్తి కవిత్వానికి ఉంటుందని అటువంటి రంగంలో తనదైన శైలిలో రచనలు చేస్తూ అందరి మన్ననలు పొంది ఇండియన్ ఐకాన్ సంస్థ వారి అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న సామాజిక సహజ కవి, జాతీయ పురస్కార గ్రహీత పొలమూరి వెంకట్ అందరికీ ఆదర్శప్రాయులని ప్రముఖ సామాజిక రాజకీయ విశ్లేషకులు నేలపూడి స్టాలిన్ బాబు కొనియాడారు. జయంతి నగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు కోట సత్తిబాబు అధ్యక్షతన మంగళవారం జయంతి నగర్ లోజరిగిన వెంకట్ సన్మాన సభ లో పలువురు వక్తలు మాట్లాడారు. జాతీయ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. దుస్సాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మైలే ఆనందరావు, కత్తుల బాబులు, గోసంగి సత్యనారాయణ, చింతా రాజేంద్రప్రసాద్,విప్పర్తి ప్రభుదాసు, సాధనాల బాలకృష్ణ, ఇసుకపట్ల శ్రీనివాస్, పొలమూరి హరిప్రసాద్, కాండ్రేగుల నాగేశ్వరరావు ఎన్. రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఆవ భూముల్లో కోట్ల రూపాయలు దోచుకున్నారని బర్రె ఆరోపణ

- ఆధారాలు బయటపెట్టాం.. చర్యలు తీసకుంటారా..?
-ప్రభుత్వానికి బర్రే ఆనంద్ కుమార్ సూటి ప్రశ్న



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్: పూర్వపు జిల్లా కలెక్టర్ మాధవి లత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, వైసీపీ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజానగరం తహాసిల్దార్ సీతాపవన్ కుమార్ ఏకమై ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ పేరుతో చేసిన అవినీతి, అక్రమాలకు సంబంధించి అన్ని ఆధారాలతో సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, రెవెన్యూ మంత్రి, సిసిఎల్ఎ కమీషనర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సహా 11 విభాగాలకు ఫిర్యాదు చేసినట్టు స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బర్రే ఆనంద్ కుమార్ వెల్లడిరచారు. అన్ని ఆధారాలను ఆయా శాఖలకు పంపామని, ఇంకా అవసరమైతే ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద స్కామ్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన భూసేకరణ అంశం నిలబడబోతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సరైన విధంగా స్పందించకపోతే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసారు. రాజానగరం నియోజకవర్గంలోని కానవరం గ్రామంలో సర్వే నెం.235%-%2బిలో నిరుపేద ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్ భూమిని, బినామీ పేర్లతో 2023 నవంబర్ 22వ తేదీన ఎకరం 30 లక్షల చొప్పున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, (డాక్యుమెంట్ నెంబర్లు 10779/2023,10780/2023, 10919/2023 తదితరాలు ఎస్ఆర్ఓ రాజానగరం) ఆ వెంటనే, రోజుల వ్యవధిలోనే అదే భూమిని 64 లక్షలకు ప్రభుత్వంతో రేటు కట్టించి, కొనుగోలు చేశారని, ఇలా ఈ ఒక్క 235- 2బి సర్వే నెంబర్ లోనే 4 కోట్ల 26 లక్షల 88 వేల రూపాయల ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారని ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరం, బూరుగుపూడి గ్రామాల మధ్యలో సుమారు 587 ఎకరాల అవ భూమిని భూ సేకరణలో కొనుగోలు చేశారని, ఈ భూమి ప్రతి సంవత్సరం వర్షాకాలం, గోదావరి ఉధృతి పెరిగినప్పుడు, సుమారు 10 నుంచి 20 అడుగుల మేర మునిగిపోతుందని, ఇలా దాదాపు రెండు నుంచి మూడు నెలలు ఉండి గోదావరి ఉధృతి తగ్గిన తర్వాత, నీరు వెనక్కి లాగుతుందని తెలిపారు. ఈ స్థలాన్ని పూడ్చితే చాలా గ్రామాలు గోదావరి వరద నీటిలో కొట్టుకుని పోతాయన్నారు. ఈ భూమికి అత్యధికంగా ఎకరా 45 లక్షల రూపాయలు రేటు కట్టి, కేవలం ఈ ఆవ భూముల్లోనే సుమారు 270 కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారన్నారు. ఇందులో దాదాపుగా 150 కోట్ల అవినీతి జరిగిందని, ప్రస్తుత మంత్రి అప్పటి ప్రతిపక్ష నాయకులు నారా లోకేష్ స్వయంగా తెలియజేసినట్టు గుర్తు చేసారు. కొండలు, గుట్టలు, చెరువులు ఇలా దేన్నీ వదలలేదని, భూగర్భ, గనుల శాఖ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, పట్టపగలే జేసీబీలతో తవ్వి లారీల్లో తరలించుకుని పోయి లేఅవుట్లను మెరక చేసుకున్నారని ధ్వజమెత్తారు. ఏ ప్రభుత్వమైనా అవినీతి చేయడం షరా మాములే అయినప్పటికీ ఇక్కడ మాత్రం ఎకరం, అర ఎకరం ఉన్న రైతులను భయపెట్టి లాక్కుని అతి తక్కువ ధర ముట్టచెప్పి వారి కడుపులపై కొట్టారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూస్తామని, ఆ తరువాత తదుపరి కార్యాచరణ చేస్తామన్నారు. సమావేశంలో విస్సాకోటి శ్రీను, కొత్తపల్లి మహేష్‌కుమార్, ఇజ్జిన రాంబాబు, కందికట్ల చిన్నారావు, ఇజ్జిన వీర్రాజు, దేగపల్లి ప్రశాంత్‌కుమార్, బరకటి నాగేశ్వరరావు, వేమవరపు రాజు, వండే లక్ష్మణ్, వేమవరపు మహాలక్ష్మి, ఊబా సూర్యారావు, వేమవరపు యేసు, గంగులూరి రామకృష్ణ, ఊబా రాజేష్, మురారి వెంకన్న, కొండ వెంకన్న, పొలిమాటి రాంబాబు, దడాల చిన్న వెంకటేష్, ఇజ్జిన వీరేష్, గెడ్డం శ్రీను, ఇజ్జిన వీరబాబు, విస్సాకోటి రాంబాబు, ఇజ్జిన అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు

## గుండె వ్యాధి నిర్ధారణ ఉచిత మెగా శిబిరం



విశ్వం వాయిస్ న్యూస్ రామచంద్రపురం పట్టణంలోని రాధాకృష్ణ మెడికల్ షాప్ నందు చిలుకూరు సేవాసమితి ఆధ్వర్యంలో స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విజయవాడ వారి సహకారంతో గుండె వ్యాధులు నిర్ధారణ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా ఈమెగా ప్రారంభోత్సవం చేశారు.అనంతరం అయన మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలకు చిలుకూరి సేవా సమితి వారు మెగా మెడికల్ కేంప్ నిర్వహించడం చాలా మంచి కార్యక్రమం అని, ఈవిధంగా ప్రజలకు సేవ చెయ్యడం అదృష్టం అని అన్నారు.ఈకార్యక్రమంలో సుమారు 300 మంది పైచిలుకు రోగులకు ఈసీజీ మరియు 2డిఎకో పరీక్షలు చేశారు.

## 1400 వ రోజుకు చేరిన స్వర్ణాంధ్ర ఉచిత మొబైల్ అన్నదాన సేవలు

**సుమారు 6 లక్షల 66 వేల మంది లబ్ధిదారులు**
**- స్వర్ణాంధ్ర సేవలు చరిత్రలో నిలుస్తాయి ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ తిలక్ కుమార్.**
**16002 వాలంటీర్ల సేవలు**
**8900 పని గంటలు వెచ్చించిన సిబ్బంది.**
**ఎండా,వానలో కూడా నిరంతరాయంగా కొనసాగుతున్న అన్నదానం**
**స్వర్ణాంధ్ర నిత్య అన్నదాన సేవలకు పలువురి ప్రశంసలు**
**అన్నార్తుల ఆకలితీర్చెందుకే వ్యయప్రయాసలకొర్చి నిర్వహణ అంటున్న రాంబాబు**




రాజమహేంద్రవరం విశ్వం వాయిస్ న్యూస్:.స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఉచిత మొబైల్ అన్నదాన సేవలు 1400 రోజుల పాటు నిరంతరాయంగా నిర్వహించడం ఒక అద్భుతం అని ఎంతో అంకితభావంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర చరిత్రలో నిలిచిపోతుందని ఏపీఈపీడీసీఎల్ సూపరిండెంట్ ఇంజనీర్ కే.తిలక్ కుమార్ ప్రశంసించారు. మంగళవారం ఉదయం స్థానిక పుష్కర ఘాట్లో జరిగిన స్వర్ణాంధ్ర ఉచిత అన్నదాన శిబిరాన్ని తిలక్ కుమార్ సందర్శించి ,స్వయంగా వడ్డింపులో పాల్గొన్నారు. గత రెండున్నర దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాంబాబు పలువురికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. కోవిడ్ లో చేసిన విశేష సేవలు, అలాగే అన్నార్తుల ఆకలి తీర్చడం కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ చేస్తున్న కృషి ఇప్పటికే విశ్వవ్యాప్తమైందన్నారు. స్వర్ణాంధ్ర నిర్వహణకు దాతలు ముందుకు వచ్చి ప్రోత్సాహంతో పాటు ఆర్థిక సహాయం అందించి అన్నార్తుల సేవలో భాగస్వాములు కావాలని కోరారు. కొత్తగా స్వచ్ఛంద సేవలో పాల్గొనే వారికి స్వర్ణాంధ్ర ఒక రోల్ మోడల్ గా నిలుస్తుంది అన్నారు. నిర్వాహకులు లైన్ డా. గుబ్బల రాంబాబు మాట్లాడుతూ. స్వర్ణాంధ్ర సేవా సంస్థ 26 వసంతాల నిరంతర సేవా ప్రయాణంలో 4 సంవత్సరాల ఉచిత అన్నదాన సేవలో కలిగిన సంతృప్తి ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అన్నదాన సేవ కు సహకరించిన దాతలకు, నగర ప్రజానీకానికి రాంబాబు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఉదయం 11:30 గంటల నుండి రాజమండ్రి స్థానిక పుష్కరాల రేవు, అలాగే ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రతిరోజు సుమారు 600 మందికి అన్నదాన సేవ జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కోవిడ్ తదనంతర పరిస్థితుల్లో ఐక్యరాజ్యసమితి పిలుపుమేరకు ప్రపంచవ్యాప్తంగా 40 శాతం మంది ప్రజానీకం రెండో పూట భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపిందని అన్నారు.ఈ మేరకు బాధ్యత గల స్వచ్ఛంద సేవా సంస్థగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ నగరంలోని దాతలు, వ్యదానుల సహకారంతో ఉచిత నిత్యాన్నదాన పథకాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. వంటవారు, వడ్డించేవారు, అలాగే స్వీకర్తలకు కూడా రాంబాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ ఈ కే.తిలక్ కుమార్ ను సత్కరించి జ్ఞాపికను అందించారు.ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లాం హిందూ నగర అధ్యక్షులు అన్సర్ అహ్మద్, స్వచ్ఛంద సేవకులు అమీర్ భాష, సీనియర్ న్యాయవాది ఇసుకపట్ల రాంబాబు, దువ్వాడ రాజా సాంబత్తులు విజయ్ కుమార్, స్వర్ణాంధ్ర కార్యదర్శి జి గంగాధర్, మేనేజర్ వై హరికృష్ణ, ఎండీ.ఇలియాస్,ఆటో శేఖర్ ,బద్రి,కే జగదీష్,కే .శ్రీనివాస్,పీ. భరత్ తదితరులు పాల్గొన్నారు

# ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణ

**-పకడ్బందీగా గ్రామాల వారీ గా సదస్సు ల నిర్వహణ ప్రణాళికను రూపొందించండి -సదస్సులకు అవసరమైన రెవెన్యూ రికార్డులను సిద్ధం**





అమలాపురం ( విశ్వం వాయిస్ న్యూస్ ప్రతినిధి )

రాష్ట్ర ప్రభుత్వం భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, ఇందుకు రెవెన్యూ యంత్రాంగం మొత్తం సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తహశీల్దార్ లను ఆదేశించారు. మంగళవారం ఉదయం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ లోని గోదావరి భవన్ లో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్.. జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి తో కలసి రెవెన్యూ సదస్సుల నిర్వహణ పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 30 వరకు 45 రోజుల పాటు జిల్లా లోని అన్ని గ్రామమాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుగుతుందని .. దీనిలో భాగంగా ఏ గ్రామంలో ఏ తేదీలో సదస్సులు నిర్వహిస్తారనే అంశం పై తగు ప్రణాళికను పకడ్బందీగా సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా మ్యూటేషన్, వెబ్ ల్యాండ్ లో కరక్షన్ లు, 1బి, దారి సమస్య, భూ తగాదాలు ఎక్కువగా ఉంటాయని, ఇలాంటి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తున్నదని, ఇందుకు అవసరమైన రికార్డులను అధికారులు సిద్ధం చేసుకోవాలన్నారు. 22ఏ, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి అన్ని విషయాలను పరిశీలించి అందుకు సంబంధించి రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి తహశీల్దార్ ప్రాథమికంగా వారి పరిధిలో ఏ రెవెన్యూ గ్రామంలో ఎక్కువ సమస్యలు వచ్చే అంశం పై ఒక నిర్ధారణకు వచ్చి రెవెన్యూ సదస్సుల నిర్వహణలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లు సచివాలయ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి రైతుల సమస్యలను ఈ 45 రోజుల్లో అర్జీల రూపంలో తీసుకోవాలన్నారు.మరో 45 రోజులలో సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టి మండల బృందం సమర్థవంతం గా పని చేయాలన్నారు. సదస్సుల్లో మండల సర్వేయర్, దేవాదాయ, వక్ఫ్ బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీ శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రతి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్ ను నియామకంతో పాటు ఆర్ డి ఓ లు వారి డివిజన్ పరిధిలో మండలాలలో జరుగు సదస్సుల నిర్వహణను ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు . ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలని తెలిపారు. రైతు సంఘాలకు ప్రజాప్రతినిధులకు జిల్లాస్థాయిలో రెవెన్యూ సదస్సుల కార్యక్రమం పై అవగాహన కల్పిస్తామన్నారు.సదస్సుల నిర్వహణకు ముందుగానే వి ఆర్ ఓ లు, వి ఆర్ ఏ లు, రెవెన్యూ సిబ్బందితో తహశీల్దార్లు ముందస్తు సమావేశం నిర్వహించుకుని, సదస్సుల నిర్వహణ పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సదస్సులో తహశీల్దార్ లు, ఆర్ ఐ, సర్వేయర్లు అన్ని రకాల రికార్డులను తీసుకు వచ్చి పరిశీలించడంతో పాటు ఏ సమస్యకైనా నిర్ణీత సమయంలోపు నోటీసులిచ్చి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఏ రోజున ఏ గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామనే అంశాన్ని ప్రజలకు తెలిసేలా పత్రికల ద్వారా, టాం టాం ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో జి కేశవర్ధన్ రెడ్డి, కొత్తపేట ఆర్డిఓ జె వి వి సత్యనారాయణ, రామచంద్రాపురం ఆర్డీవో ఎస్ సుధా సాగర్, సర్వే ఏడి ప్రభాకర రావు, తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దార్ లో, సర్వేయర్లు, ఆర్ ఐ లు వీఆర్వోలు, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# జిల్లాలోని అన్ని ప్రైమరీ అగ్రికల్చర్ సొసైటీలలో కంప్యూటరైజేషన్ చేయాలి



అమలాపురం కలెక్టరేట్ ( విశ్వం వాయిస్ న్యూస్ )ఆగస్టు 31 లోపు జిల్లాలోని అన్ని ప్రైమరీ అగ్రికల్చర్ సొసైటీలలో కంప్యూటరైజేషన్పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం అమలాపురం కలెక్టరేట్లోని కలెక్టర్ వారి చాంబర్లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ 3 వ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 166 ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీలను ఆగస్టు 31 లోపు కంప్యూటరైజేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కంప్యూటరైజేషన్ లో భాగంగా డేటా క్యాప్చర్ టూల్ ద్వారా జిల్లాలోని పిఎసిఎస్ లోని సభ్యుల వివరాలు, పి ఎ సి ఎస్ ఇచ్చిన లోన్లు, సొసైటీల ఆస్తులు తదితర వివరాలను క్యాప్చర్ చేసి ఆన్లైన్లో ఉంచాలన్నారు. జిల్లాలో నాలుగు పిఎసిఎస్ లు పెట్రోల్ బంకులు నడపడానికి అనుమతుల కోసం దరఖాస్తు చేసి ఉన్నాయని .. సంబంధిత సొసైటీలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. కౌలు రైతులు పంట రుణాలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. సిసిఆర్సి కార్డులు ఉన్న ప్రతి రైతుకూ పంట రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి, జిల్లా సహకార అధికారి మురళి కృష్ణ, నా బోర్డు డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ సోమి నాయుడు, డిసిసి బీ సీఈఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారుల

## వంగలపూడి పిహెచ్సిలో ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్: తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వంగలపూడి పి హెచ్ సి లో ప్రభుత్వ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమం జరిగింది. వచ్చిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలకు మంచి వైద్యం అందించాలని ప్రభుత్వ ఆలోచన దృష్టిలో పెట్టుకొని దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారికి ఈ కార్యక్రమాల ద్వారా ఇంటి వద్దకె మంచి వైద్యాన్ని అందిస్తున్నామని తెలియజేశారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి ఎన్. రాజు, ఎం ఎల్ హెచ్ పి చంద్రశేఖర్, ఏఎన్ఎం స్వప్న, ఆశాలు లక్ష్మి, జ్యోతి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## అక్షయ ఆర్థిక సేవలు

విశ్వం వాయిస్ రావులపాలెం.13/8/202431 వేలు ఆర్థిక సాయంరావులపాలెం:మండలంలోని రావులపాలెం కొత్త కాలనికి చెందిన బంగారు జాన్సన్ అబ్బాయికి ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి కోమలో ఉన్నాడు. పేద కుటుంబం కావడంతో వైద్యం చేయించుకునే స్తోమత లేక మంగళవారం రావులపాలెంలోని అక్షయ సేవా సంస్థను సహాయం కోరగా సంస్థ నుండి రూ.10 వేలు, సంస్థ సభ్యులు చిన్నం తేజ రెడ్డి రూ.20 వేలు, మిరియాల సుబ్బరాజు, రూ.500,ఎడవల్లి విజయ్ కుమార్, రూ.500 మొత్తం రూ.31వేలు అక్షయ సేవా సంస్థ సభ్యులు అందించారు.

## మా ఫీల్డ్ అసిస్టెంట్ వల్ల మాకు సమస్యలు లేవు


**కావాలనే కుట్ర చేస్తున్నారు**

**అని గుడాల ఉపాధి కూలీలు ఫిర్యాదు:**



అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ 13-8-2024 : అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుడాల గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ధోనిపాటి వీర వెంకట సత్యనారాయణ వల్ల మాకు ఎటువంటి ఇబ్బందులు గానీ సమస్యలు గానీ లేవంటూ ఉపాధి కూలీలు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం లో సూపెరడెంట్ కి ఫిర్యాదు ఇచ్చారు. కొంతమంది కూలీలకు డబ్బులు రాలేదు కదా అని మీకు పని కావాలంటే సంతకాలు పెట్టండి అని లేనిపోని ఆరోపణలు తో సంతకాలు పెట్టించి ఫీల్డ్ అసిస్టెంట్ పై ఆరోపణలు చేస్తూ తొలిగించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఇవన్నీ కూడా అబద్దాలు అని ఉపాధి కూలీలు ఇచ్చిన ఫిర్యాదు లో పేర్కొన్నారు.ఏమైనా సమస్యలు ఉంటే మా గ్రామం లో మా ఉపాధి కూలీలు మధ్య సమస్య ని పరిష్కరించి ధోనిపాటి సత్యనారాయణ నే కొనసాగించాలని ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున ఎండీపీవో కార్యాలయం వద్దకు వచ్చి ఫిర్యాదు ఇచ్చారు.సాపే కృష్ణ కుమారి, పి వెంకటలష్మి, జి సీతమ్మ, వి సుబ్బలక్ష్మి, మట్టపర్తి వెంకటలక్ష్మి,పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై ఆలమూరు ఎస్సై ఎం అశోక్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు



కొత్తపేట ఆలమూరు ఆగస్టు 13. విశ్వం వాయిస్ న్యూస్. ఆలమూరు మండలం మోదుకూరులో రహస్యంగా ఆడుతున్న పేకాట శిబిరంపై ఆలమూరు ఎస్సై ఎం అశోక్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గొడితి రాజు (మోదుకూరు),పాడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ (ఏడిద),కొవ్వాడ నవీన్ (లాలాచెరువు),గంధం విజయకుమార్ (ఏడిద సీతానగరం) లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 2,900 రూపాయలతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని వారందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# దేశంలో ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలి

**-ప్రతిఇంటికి,వ్యాపారానికి,ప్రతివక్కరీకి జాతీయ జెండా నినాదాలు**

**- క్షత్రియ బాలసుబ్రమణ్యం సింగ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు పంపిణీ**



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక కోటగుమ్మం సెంటర్ లో వ్యాపార దుకాణాలకు ,ప్రజలకు ,వ్యాపారస్తులకు బిజెపి రాష్ట్ర నాయకుడు క్షత్రియ బాలసుబ్రమణ్యం సింగ్ ఆధ్వర్యంలో ప్రతి షాపులకుకి జాతీయ జెండా పంపిణీ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పరిమి రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ,జవ్వార్, కే హారిక పాల్గొన్నారు.ఈ సంధర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశంలో ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని,యువతకు దేశ నాయకులు యొక్క స్ఫూర్తిని కలిగించాలని, తద్వారా దేశం మరింత ముందుకు వెళుతుంది అని అన్నారు. అనంతరం రాజమండ్రి ప్రధాన మెయిన్ రోడ్డు లో వ్యాపార దుకాణాలకు, స్థానిక ప్రజలకు జాతీయ జెండాలు పంపిణీ చేస్తూ ర్యాలీగా ముందుకు సాగారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లలిత కుమార్ జైన్ ,వీరాచంద్ జైన్, సంజయ్, మల్లిడి శ్రీనివాస్ రెడ్డి ,కిరణ్, రుక్మామదరావు, భువన్, తంగుడి వెంకటరావు, రమణకుమారి, రాజేశ్వరి, రౌతు వాసు, తెలుగుదేశం నాయకులు కర్రీ కాశీ విశ్వనాథ్, జనసేన నాయకులు పాలిక సతీష్, రొక్కం రాజేష్, యామిని మోహన్, గునిశెట్టి కిరణ్, దాసరి గిరీష్ ,బాలు, బీజేవైఎం పవన్, పెద్ద ఎత్తున కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# అదాని కంపెనీలపై వస్తున్న ఆరోపణలపై కేంద్ర ఎందుకు మౌనంగా ఉంది..?

**- చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎస్సీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు**

**- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్**




రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ మంగళవారం రాజమండ్రి ప్రెస్ క్లబ్ అయన మాట్లాడుతూ..రిజర్వేషన్లు ఎత్తేసే దానికి విదేశీ కుట్ర. దాంట్లో ఆర్ఎస్ఎస్, బిజెపి భాగస్వామి.సెబీ స్కామ్ లో తప్పులు లేకుంటే జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలి.పివి హయాంలో సెక్యూరిటీ స్కామ్ ఆరోపణలు వస్తే, ఆనాడు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేశారు.అదాని కంపెనీలపై వస్తున్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది?,జగన్ పరిపాలన కంటే చంద్రబాబు పరిపాలన జబర్దస్త్ గా ఉంది. ఆయన (చంద్రబాబు ) టిడిపి, నేను (చింతామోహన్ ) కాంగ్రెస్ అయినప్పటికీ మా మధ్య రాజకీయ వైరుధ్యం ఉన్నప్పటికీ చంద్రబాబును అభినందించక తప్పదు.కాపు, బలిజలు ఏనాటికైనా ముఖ్యమంత్రి అవుతారు.కాపు డిప్యూటీ సీఎం అయినంత మాత్రాన నాకు సంతృప్తిగా లేదు. కాపు బలిజల్లో కసి, పట్టుదల ఉండాలి. అది ఉంటే ఏదో ఒక రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి అవుతారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎస్సీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు.జిల్లా కలెక్టర్లుగా, జిల్లా ఎస్పీలుగా ఎస్సీ అధికారులను నియమించకపోవడమే ఎందుకు నిదర్శనం. బిజెపి ది విభజించు పాలించు సిద్ధాంతంతో ఉంది. అందులో భాగంగానే వర్గీకరణ తీర్పు.తుషార్ మెహతా సుప్రీంకోర్టులో వర్గీకరణకు అనుకూల వాదనలు చేశారు.వెనుకబడిన వర్గాలు దేశంలో 60 కోట్ల మంది ఉంటే, ముగ్గురే సుప్రీంకోర్టు జడ్జిలుగా ఉన్నారు.20 కోట్ల మంది మైనార్టీలు ఉంటే సుప్రీం జడ్జిగా ఒకరే ఉన్నారు. 34 మంది సుప్రీం జడ్జిల్లో ఒకే సామాజిక వర్గం వారు 20 మంది ఉన్నారు. 5000 సంవత్సరాలుగా అంటరానితనం భారతదేశంలో ఉన్నది.సౌత్ ఆఫ్రికా దర్బార్లో మహాత్మా గాంధీ అంటరానితనం గురించి తెలుసుకొని, బెజవాడ వచ్చి అన్ని విషయాలు తెలుసుకున్నారు. కేరళ నుంచి కన్యాకుమారి వరకు గాంధీ పాదయాత్ర చేశారు. ప్రతి దగ్గర ఐదు నిమిషాలు మహాత్మా గాంధీ మాట్లాడారు.అంటరానితనం, హరిజనోద్ధరణ, దేశానికి స్వతంత్రం గురించి మాత్రమే గాంధీ ప్రస్తావించారు.దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు స్వతంత్రం వచ్చిన తర్వాత ఆరోజు హరిజనులు, నేడు దళితులకు రిజర్వేషన్లు ఇవ్వాలని నెహ్రూకి గాంధీ చెప్పారు.బెజవాడకు చెందిన చక్రయ్యను దేశానికి తొలి రాష్ట్రపతిని చేయాలని గాంధీ కోరుకున్నారు. అనారోగ్యంతో చక్రయ చనిపోవడంతో, అది నెరవేరలేదు.రాబోవు నాలుగు సంవత్సరాలలో దేశంలో రిజర్వేషన్లు ఉండవు. ఇందులో విదేశీ కుట్ర ఉంది. ఆ కుట్రలో ఆర్ఎస్ఎస్ బిజెపి భాగస్వాములు.ఫిబ్రవరిలో మోడీ హైదరాబాదులో రెండు ముద్దులు రెండు హగ్గులు ఇచ్చారు. అందులో భాగంగానే సుప్రీం కోర్ట్ వర్గీకరణ తీర్పు వచ్చింది. 10 లక్షల కోట్లు జగన్ అప్పులు తెచ్చారు. తెచ్చిన అప్పులు ఏ జిల్లాకు ఎంత ఖర్చు చేశారు? ఆ వివరాలు బయటపెట్టాలి. ముఖ్యమంత్రికి నెల రోజులు గడువిస్తున్నా...ముఖ్యమంత్రి ప్రజలకు తెలియజేయకుంటే, నేనే ఆ వివరాలు బయటపెడతా... నాకు తెలుసు ఆ వివరాలు ఎలా రాబట్టాలో! అమరావతి, పోలవరం తప్ప చంద్రబాబుకు మరేమీ గుర్తుకు రావడం లేదు. రాజమండ్రి 20 ఏళ్ల క్రితం ఎలా ఉందో నేడూ అలానే ఉంది. మంత్రి పయ్యావుల కేశవ్ అప్పు ఇవ్వండి... అప్పు ఇవ్వండి...అంటూ నిర్మల సీతారామన్ ను అడుక్కుంటున్నారు. తెలుగు ప్రజలు అప్పులు అడుక్కునే స్థితికి దిగజార్చింది ఆ రెండు కుటుంబాలే. తెలంగాణలో ఒక కుటుంబం, ఆంధ్రాలో ఒక కుటుంబం వల్ల రాష్ట్ర విభజన జరగడమే కాదు, తెలుగు వాళ్ళ ప్రతిష్ట, ఆత్మగౌరవం దెబ్బతింది అని అన్నారు




# రియా చక్రవర్తి అందాల ఆరబోత

ఈ బ్యూటీ టీవీ హోస్ట్ గా కెరియర్ స్టార్ట్ చేసి తరువాత మోడలింగ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆపై నటిగా మారింది. తూనీగ తూనీగ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. అయితే ఈ మూవీ ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. బాలీవుడ్ లో కూడా తొందరగానే ఎంట్రీ ఇచ్చి మేరే డాడ్ కి మారుతి సినిమాతో తన లక్కుని టెస్ట్ చేసుకుంది. అనంతరం అడపాదడపా కొన్ని చిన్న సినిమాలు చేసుకుంటూ వచ్చింది. ఆ మధ్య సుశాంత్ సింగ్ రాజ్ పుత్ ఆత్మహత్య కేసులో రియా చక్రవర్తి మీద తీవ్ర ఆరోపణలు వచ్చాయి. రియా చక్రవర్తి పోలీసు విచారణ కూడా ఎదుర్కొంది. అదే సమయంలో డ్రగ్స్ కేసులో కూడా ఆమె అరెస్ట్ అయ్యింది. చాలా కాలం జైల్లో ఉన్న తర్వాత రియా చక్రవర్తి బయటకొచ్చింది. జైలు నుంచి బయటకొచ్చాక మూవీ ఆఫర్స్ కోసం రియా చక్రవర్తి సీరియస్ గా ట్రై చేసింది. అయితే ఆమెకి అవకాశాలు మాత్రం రాలేదు. దీంతో రియా చక్రవర్తి నటిగా తన కెరియర్ ని ముగించేసింది. రియా చక్రవర్తి ఎంటీవీ షోలో హోస్ట్ గా కెరియర్ స్టార్ట్ చేసింది. హీరోయిన్‌గా ఎంట్రీకి ముందు వరకు డిఫరెంట్ షోలకి హోస్ట్ గా చేసింది. హోస్ట్ గా ఉన్న అనుభవంతో వీడియో పాడ్ కాస్టర్ గా రాణించే ప్రయత్నంలో ఉంది. తాజాగా ఈ అమ్మడు ఇన్ స్టాగ్రామ్ లో ఫోటో షేర్ చేసింది. ఈ ఫోటోలో లాంగ్ టీ షర్ట్ ధరించి దానిపై షార్టు వేసుకొని సోఫాలో కూర్చొని కనిపిస్తోంది. ఈ ఫోటోకి చాప్టర్ 2 అని పోస్ట్ పెట్టింది. రియా చక్రవర్తి చాప్టర్ 1 పాడ్ కాస్ట్ వీడియోని సుస్మిత సేన్ తో చేసింది. ఇప్పుడు చాప్టర్ 2 పాడ్ కాస్ట్ వీడియోని రిలీజ్ చేయబోతు న్నట్లు ఈ ఫోటోతో రివీల్ చేసింది. ఈ పిక్స్ తో రియా చక్రవర్తి చాలా గ్లామరస్ గా ఉందని ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

# మిస్టర్ బచ్చన్ సెన్సార్ పూర్తి




మాస్ మహారాజ్ రవితేజ ఆగష్టు 15న మిస్టర్ బచ్చన్ తో బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ చిత్రాన్ని హరీష్ శంకర్ తెరకెక్కించారు. ఇప్పటికే మూవీ నుంచి వచ్చిన సాంగ్స్, ట్రైలర్ కి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. మిక్కీ జె మియర్ మిస్టర్ బచ్చన్ సినిమాకి అదిరిపోయే మాస్ బీట్స్ తో పాటు రొమాంటిక్ సాంగ్స్ ని అందించారు. అలాగే సూపర్ మెలోడీని కూడా ఇచ్చారు. చాలా రోజుల తర్వాత ఓ మంచి ఆల్బమ్ తో మిస్టర్ బచ్చన్ మూవీ వచ్చిందని చెప్పొచ్చు. కూడా కమర్షియల్ లైన్ లో సినిమా ఉండబోతోందని స్పష్టం చేసింది. ఇలాంటి కథలు చెప్పడంలో హరీష్ శంకర్ దిట్ట. అందుకే మిస్టర్ బచ్చన్ సినిమాపై ప్రేక్షకులలో కూడా కొంత హైప్ ఉంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బృంద సభ్యులు మిస్టర్ బచ్చన్ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చారు. చిత్ర యూనిట్ ఈ సెన్సార్ పోస్టర్ ని తాజాగా రిలీజ్ చేసింది. సెన్సార్ టాక్ ప్రకారం సినిమాలో మాస్ యాక్షన్ ఎలిమెంట్స్ గట్టిగానే ఉన్నట్లు తెలుస్తోంది.



# 'ఈగల్' బ్యూటీ గ్లామర్ డోస్ !

రవితేజకు జోడీగా ఈగల్ సినిమాలో నటించే అవకాశంను ఈ అమ్మడు దక్కించుకుంది. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో పెద్ద హీరోతో నటించింది అనుకుంటున్న సమయంలోనే ఆ సినిమా ఫ్లాప్ అవ్వడంతో కాస్త నిరుత్సాహం కు గురి అయ్యింది. ఆ సినిమా తర్వాత టాలీవుడ్‌లో ఆఫర్లు వస్తాయో లేదో అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో డబుల్ ఇస్మార్ట్ సినిమాలో రామ్‌కు జోడీగా నటించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న డబుల్ ఇస్మార్ట్ సినిమాపై కావ్య థాపర్ ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తోంది. తమిళంలో మాత్రం ఈ అమ్మడు పిచ్చైక్కారన్ 2 సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుని అక్కడ వరుసగా ఆఫర్లు సొంతం చేసుకుంటుంది. సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఫోటోలను షేర్ చేయడం ద్వారా తన ఫాలోవర్స్ సంఖ్య ను భారీగా పెంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలను చూస్తే కావ్యా థాపర్ ఈ మధ్య కాలంలో గ్లామర్ డోస్ పెంచిందే అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. వైట్ షర్ట్ ధరించి పై బటన్స్‌ను తొలగించి, కవ్వించే చూపులతో నెటిజన్స్ చూపు తిప్పుకోనివ్వని అందం కావ్య థాపర్ అందం అనిపిస్తుంది. ఈ స్థాయి లో అందంగా ఉన్న కావ్య థాపర్ కి మరిన్ని సినిమాల్లో ఆఫర్లు రావాలి, స్టార్ హీరోయిన్ పీస్ అంటూ నెటిజన్స్ ఈ ఫోటోలకు తెగ కామెంట్స్ చేస్తున్నారు.



# విశ్వక్ సేన్.. వ్వాటే లైనప్!

యంగ్ హీరో విశ్వక్ సేన్ ఈ ఏడాది గామి, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలతో ప్రేక్షకుల ముందుకి వచ్చారు. గామి సినిమా బ్రేక్ ఈవెన్ కలెక్షన్స్ అందుకొని కమర్షియల్ సక్సెస్ అయ్యింది. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమా కూడా పర్వాలేదు అనే టాక్ తెచ్చుకుంది. అతని లైనప్‌లో ఉన్న నాలుగు సినిమాలు వేటికవే చాలా డిఫరెంట్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రవితేజ ముళ్ళపూడి దర్శకత్వంలో విశ్వక్ సేన్ చేసిన మెకానిక్ రాకీ మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. అక్టోబర్ 31న ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతోంది. తర్వాత మరో మూడు సినిమాలు విశ్వక్ సేన్ లైన్ అప్ లో ఉన్నాయి. ఆ మూడు కూడా అఫీషియల్‌గా ఎనౌన్స్ అయ్యాయి. వాటిలో లైలా మూవీ ఇప్పటికే సెట్స్ పైకి వెళ్లినట్లు తెలుస్తోంది. రామ్ నారాయణ దర్శకత్వంలో ఈ సినిమా సిద్ధమవుతోంది. బట్టల రామస్వామి సినిమాతో రామ్ నారాయణ దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ చిత్రం తర్వాత లాంగ్ గ్యాప్ తీసుకుని ప్రస్తుతం లైలా సినిమాతో బిగ్ స్క్రీన్ పై ప్రూవ్ చేసుకోవడానికి రెడీ అవుతున్నారు. నెక్స్ట్ గంటా శ్రీధర్ దర్శకత్వంలో విశ్వక్ సేన్ మూవీ ఉండబోతోంది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా కనిపించబోతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో యాక్షన్ డ్రామాతో ఈ సినిమా తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. దీని తర్వాత జాతి రత్నాలు ఫేమ్ కెవి అనుదీప్ దర్శకత్వంలో విశ్వక్ సేన్ మూవీ రానుంది.

## క్రీడా వాయిస్

# ప్రమోద్ భగత్‌పై 18 నెలల సస్పెన్షన్ వేటు



టోక్యో 2020 పారా ఒలింపిక్ క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచిన బ్యాడ్మింటన్ ప్లేయర్ ప్రమోద్ భగత్‌పై 18 నెలల నిషేధం విధించినట్లు బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ప్రకటించింది. యాంటీ డోపింగ్ నియమావళిని ఉల్లంఘించినట్లు బీడబ్ల్యూఎఫ్ పేర్కొన్నది. 12 నెలల వ్యవధిలోనే షట్లర్ భగత్ మూడు సార్లు పరీక్షల్లో విఫలమైనట్లు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఆఫ్ స్పోర్ట్ తెలిపింది. దీంతో ప్రమోద్ భగత్.. పారిస్ 2024 పారాఒలింపిక్ గేమ్స్‌కు దూరంకానున్నాడు. భగత్ చేసిన అప్పీల్‌ను సీఏఎస్ అప్పీల్స్ డివిజన్ జూలై 29వ తేదీన రద్దు చేసింది. అనర్హత వేటు తక్షణమే అమలులోకి వస్తుందని సీఏఎస్ తెలిపింది.

# వినేష్ అప్పీల్‌పై తీర్పు వాయిదా



పారిస్ ఒలింపిక్స్‌లో తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ వేసిన పిటిషన్‌పై తీర్పు మరోసారి వాయిదా పడింది. ఇప్పటికే విచారణ పూర్తి చేసిన కోర్టు తీర్పును వాయిదా వేసింది. తుది తీర్పును ఈనెల 16వ తేదీకి వాయిదా వేసింది. దీంతో తీర్పు ఆమెకు అనుకూలంగా వస్తుందా? రాదా? అని భారతీయులంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పారిస్ ఒలింపిక్స్ 2024లో వినేష్ ఫొగట్.. తొలి రౌండ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్, వరల్డ్ నెంబర్ వన్ యుయ్ సుసాకి(జపాన్)ని మట్టికరిపించింది. రెండో రౌండ్‌లో ఉక్రెయిన్ ప్లేయర్ ఒక్సానా లివాచ్‌ను ఓడించింది. సెమీ ఫైనల్లో క్యూబా రెజ్లర్ యుస్నీలీస్ గుజ్మాన్ ఓడించి ఫైనల్ చేరింది. అనూహ్యంగా ఫైనల్‌కు ముందు 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఆమెపై ఒలంపిక్ యాజమాన్యం అనర్హత వేటు వేసింది.


# 17 నుంచి 19 వరకు రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు

## జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్



ఈ నెల 17 తేదీ నుంచి 19 తేదీ వరకు రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు జిల్లా కేంద్రంలో జరగనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె ఏ నాయుడు, నున్నా సురేష్ ప్రకటించారు. మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియం లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర పోటీలు వివరాలను తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరుకానున్నారు అని తెలిపారు. పోటీలకు ముందుగా అర్హత పోటీలు 16 తేదిన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు,ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లు పూసపాటి అతిధి విజయలక్ష్మి గజపతిరాజు, కోళ్ల లలితకుమారి పాల్గొననున్నారు అని తెలిపారు. ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ముసురుకున్న వివాదాలు




2024 పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ ఫోగాట్‌కు తృటిలో పతకం చేజారినా.. ఈ ఒలింపిక్స్‌లో వివాదాస్పద నిర్ణయాలు అథ్లెట్లకు తీవ్ర మానసిక క్షోభకు గురిచేశాయి. అద్భుత ఫలితాలను ఎలా ఆస్వాదిస్తామో అదే మాదిరిగా వివాదాస్పద విషయాలను తీసుకోవాల్సి వుంది. కొందరు ఫలితం యొక్క మార్పును చూసినా మరింత క్షోభకు గురవుతారు. మరికొందరు పతకాలకు చేరువై వాటిని కోల్పోవాల్సి కూడా వస్తుంది. వీరిలో అందరికంటే ముందు భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్ ఉండగా.. అల్జీరియా మహిళా బాక్సర్ ఇమానే ఖెలిఫ్ చివర్లో ఉన్నారు. బాక్సింగ్ మహిళల విభాగంలో ఇమానే ఖెలిఫ్, తైవాన్ బాక్సర్ లిన్-యు-టింగ్ ఇద్దరికీ ఈ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు దక్కాయి. లింగ వివక్షపై వీరిపై పత్రికల్లో సూటిపోటి రాతలతో వారిని తలదించుకొనేలా చేసినా.. నిర్వాహకులు అవేమీ పట్టించుకోకుండా తుదిపోరులో నెగ్గిన వీరిద్దరికీ స్వర్ణ పతకాలను అందజేశారు. 2023 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌నుంచి వీరిని లింగ వివక్ష కారణంగా అనర్హత వేటు పడినా.. ఒలింపిక్స్‌లో వీరిద్దరూ ఆయా కేటగిరీల్లో స్వర్ణ పతకాలను సాధించారు. అయినా వీరు లింగ వివక్షపై తప్పుడు ఆరోపణలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

**వినేశ్ ఫోగాట్ :** రెజ్లింగ్ 50కిలోల ఫ్రిస్టైల్ విభాగంలో ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫోగాట్ ఒలింపిక్స్‌లో సరికొత్త చరిత్రను లిఖించింది. ఆ మరుసటిరోజు నాటికి 100 గ్రాముల అధిక బరువు కారణంగా పతకం కోల్పోవాల్సి వచ్చింది. అలాగే యునైటెడ్ రెజ్లింగ్ ఫెడరేషన్(యుడబ్ల్యుడబ్ల్యు) ఆమెపై అనర్హత వేటు వేసింది. దీంతో ఆమెకు దక్కాల్సిన పతకాన్ని సెమీస్‌లో ఓడిన క్యూబా బాక్సర్‌ను ఫైనల్ బౌట్‌కు పంపించి పోటీ నిర్వహించి పతకాలను అందజేయడం కూడా జరిగిపోయింది. ఈ సంఘటనతో ఆమెకు కోట్లాదిమంది అభిమానులు మద్దతు లభించినా.. రాజకీయ కుట్రతో ఇది జరిగిందని ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్‌లో ఆందోళన చేశాయి. 'కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్(కాస్) మంగళవారం(13న) ఆమెను జరిగిన అన్యాయంపై తుది తీర్పు వెలువరించనుంది.

**టామ్ క్రెయిగ్(ఆస్ట్రేలియా హాకీ ప్లేయర్) :** ఆస్ట్రేలియా పురుషుల హాకీజట్టు సభ్యుడు టామ్ క్రెయిగ్ ఒలింపిక్ క్రీడా గ్రామంలో కొకైన్‌తో పట్టుబడ్డాడు. అతడు 17ఏళ్ల యువకుని నుంచి కొకైన్ కొనుగోలు చేయడానికి ప్రయత్నించి పారిస్ పోలీసులకు దొరికాడు. దీంతో నిర్వాహకులు అతడికి హెచ్చరికలు జారీచేసి జట్టులో సభ్యునిగా కొనసాగేందుకు అనుమతిచ్చారు. కానీ ఆస్ట్రేలియన్ ఒలింపిక్ కమిటీ(ఎఓసి) అతడిని జట్టు నుంచి తప్పించి ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించడానికి అంగీకరించలేదు.

**జోర్డాన్ ఛిలేస్(అమెరికా) :** అమెరికా మహిళా జిమ్నాస్ట్ జోర్డాన్ ఛిలెస్ కోచ్ న్యాయ నిర్ణేతలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించాడు. ఛిలెస్ ప్రదర్శనకు, కాంస్య పతకం దక్కేందుకు 0.1పాయింట్ల వ్యత్యాసం ఉంది. దీంతో ఆమె కోచ్ సెసిలీ లాండి స్కోర్‌ను 0.1 పాయింట్లు జోడించమంటూ అంతర్జాతీయ జిమ్నా స్టిక్స్ ఫెడరే షన్(ఎఫ్ఐజి)కి సిఫార్సు చేశాడు. దీంతో ఆమె కాంస్య పతకానికి చేరువైంది. ఆ తర్వాత ఈ విషయం బయటకు రావడంతో 'కాస్' విచారణ చేపడుతున్నట్లు పేర్కొనడంతో ఆమె ఐదో స్థానానికి పరిమితమైంది.

**లూనా అలోన్సే(పరాగ్వే) :** పరాగ్వేకు చెందిన సిమ్మర్ లూనా అలోన్సే అనుచిత వ్యాఖ్యల కారణంగా ఒలింపిక్స్ మధ్యలోనే బహిష్కరించబడింది. మహిళల 100మీ. బటర్‌ఫ్లై ఈవెంట్‌లో సెమీస్‌కు చేరడంలో విఫలమైన ఆమె.. బ్రెజిల్ ఫుట్‌బాల్ ఆటగాడు నెరుమార్, తానకు దగ్గరగా సంబంధాలు ఉన్నట్లు పత్రికలకు వెల్లడించింది. ఇదికాస్త సోషల్ మీడియాలో పెను దుమారాన్ని రేపడం.. ఆమెను పోటీల మధ్యలోనే స్వదేశానికి తిరిగి పంపించి వేయడం చక చకా జరిగిపోయాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com